Follow: @ANNTELUGU

ANN తెలుగు

24-03-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 86  పేజీలు-08  వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## సీఎంతో రాజగోపాల్ రెడ్డి భేటీ

### పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ టాపిక్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర చర్చకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరలేపారు. అసెంబ్లీ మండలి హాల్‌లోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి తో రాజగోపాల్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. దాదాపు 10 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య జరిగిన ముఖాముఖి మీటింగ్ హాట్ టాపిక్ గా మారింది. గత కొంత కాలంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ తీరుపై కొంత అసంతృప్తితో ఉన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తామంటూ మోసం చేశారంటూ పార్టీ అధిష్టానంపై వీలుచిక్కినప్పుడల్లా ఘాటు వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### నేను సీఎం అయిత

- రేవంత్ నేను అన్నదమ్ములం
- ఆయనను సీఎం చేసింది నేనే
- మీడియాతో చిట్ చాట్ లో మల్లారెడ్డి

02



### దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు

- ఏప్రిల్ 16కు వాయిదా

02



### సింగర్ మంగ్లీ క్లారిటీ

- ఆ స్కాంతో నాకు సంబంధం లేదు

02



## బోనస్ బోగస్ అయ్యింది

### అసెంబ్లీలో హరీష్ రావు ఫైర్

**హైదరాబాద్, మహా:** సన్న బియ్యానికి బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ పథకాన్ని బోగస్ కింద మార్చేసిందని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు వ్యాఖ్యానించారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని.. రైతు భరోసా పూర్తి స్థాయిలో ఇవ్వలేదని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. ఈ యాసంగి సీజన్ కైనా వరికి బోనస్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. గత రెండేండ్లుగా అకాల వర్షాలతో , వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. 'పంటల బీమా అమలు చేయకపోతే రైతులు ఏం కావాలి? ఇన్ పుట్ సబ్సిడీ ఎందుకు ఇవ్వడం లేదు.'

మిగతా 2లో

# ఇరాన్‌తో యుద్ధానికి బ్రేక్

## చేతులెత్తేసిన ట్రంప్

ఐదురోజులు విరామం..
ఇరాన్ తో చర్చలు సానుకూలం

ఎద్దేవా చేసిన ఇరాన్..
చర్చలు నిజమంటూ వరుస ట్వీట్లు

ట్రంప్ ప్రకటనతో
13 శాతం తగ్గిన చమురు ధరలు



**మహా నెట్ వర్క్ :**

అమెరికాఇరాన్ యుద్ధంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై గడచిన మూడు వారాలుగా విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధం ఎలా ముగించాలో తెలియక సడన్ యూటర్న్ తీసుకున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను చల్లార్చే దిశగా ఆయన కీలక నిర్ణయం ప్రకటించారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై జరపాల్సిన సైనిక దాడులను ఐదు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఓ సుదీర్ఘ సందేశాన్ని పోస్ట్ చేశారు. హార్ముజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని అతిపెద్ద పవర్ ప్లాంట్లను సమూలంగా ధ్వంసం చేస్తామంటూ విధించిన 48 గంటల అల్టిమేటం గడువు ముగియకముందే ఆయన ఈ సానుకూల నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత రెండు రోజులుగా వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య తెరవెనుక జరిగిన దౌత్యపరమైన చర్చలు అత్యంత సానుకూలంగా, నిర్మాణాత్మకంగా సాగాయని ట్రంప్ తన పోస్ట్‌లో వెల్లడించారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పే ఉద్దేశంతోనే తాము ఈ చర్చల్లో పాల్గొన్నామని, ఈ వారమంతా ఈ మంతనాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో

# మూసీ ప్రక్షాళన ఆగదు


## ఎవరినీ నిరాశ్రయులను చేయం

### ప్రాజెక్టు ఆపొద్దు.. నిర్మాణాత్మక సలహాలివ్వండి

సూచనల స్వీకరణకు డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు.. శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:**

చారిత్రక హైదరాబాద్ మహానగరానికి పూర్వవైభవం తీసుకొచ్చే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'మూసీ ప్రక్షాళన' ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగేది లేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ఏ ఒక్కరినీ నిరాశ్రయులను చేయబోమని, వారికి నష్టం జరగకుండా మరింత మెరుగైన వసతులతో ప్రభుత్వమే స్వయంగా పునరావాసం కల్పిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా, సమగ్రంగా సమాధానమిచ్చారు. లక్ష చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించిన రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతను, నగర భవిష్యత్తు ప్రణాళికలను ఆయన సభ ముందు ఉంచారు. మూసీ ప్రక్షాళనను కేవలం నగర సమస్యగానే చూడొద్దని ముఖ్యమంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మూసీ కాలుష్యంతో దశాబ్దాలుగా నల్గొండ ప్రజలు పడుతున్న ఆవేదనాభరితమైన జీవిత సత్యాలను అర్థం చేసుకుంటే ఎవరూ ఈ ప్రాజెక్టును ఆపాలని కోరరని ఆయన అన్నారు. మూసీ ప్రక్షాళన ప్రణాళికలను క్షుణ్ణంగా చదివి, ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.



మిగతా 2లో


## ద్వేషపూరిత ప్రసంగాలపై ఉక్కుపాదం

చెప్పినట్లే బిల్లు తెస్తున్న సీఎం రేవంత్

కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు



వివరాలు 2లో



## 'కాళ్లు మొక్కుతా.. పాస్ చేయండి సార్!'

- జవాబు పత్రంలో ఇంటర్ విద్యార్థి భావోద్వేగ లేఖ
- తాను చదివినవి పరీక్షలో రాలేదని, బార్డర్ పాస్ వేసినా చాలంటూ వేడుకోలు
- ఏకంగా ఎగ్జామినర్ కాళ్లు మొక్కుతున్నట్లు జవాబు పత్రంలో బొమ్మ గీసిన వైనం
- నెట్టింట వైరల్‌గా మారిన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట విద్యార్థి ఆన్సర్‌షీట్

**హైదరాబాద్, మహా:** ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకన సమయంలో ఎగ్జామినర్లకు జవాబు పత్రాల్లో అప్పుడప్పుడూ వింత అనుభవాలు ఎదురవుతుంటాయి.

మిగతా 2లో



### క్యూనెట్‌పై పోలీసుల పంజా..

## వందల కోట్ల స్కామ్!

- మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో పోలీసుల సోదాలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో కొనసాగుతున్న తనిఖీలు
- మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో వందల కోట్లు వసూలు చేసిన క్యూనెట్
- హైదరాబాద్‌లో 6 చోట్ల సీసీఎస్ పోలీసుల దాడులు..
- మొత్తం 25 ప్రాంతాల్లో విచారణ... 20 మంది కీలక నిందితుల గుర్తింపు

02



### గవర్నర్‌ను కలిసిన

## మంత్రి కొండా సురేఖ

భద్రాచలం సీతారామ కల్యాణానికి హాజరు కావాలని విజ్ఞప్తి

ఆహ్వాన పత్రిక అందజేత

వివరాలు 8లో







# ఎర్ర బంగారం భగభగ..

### క్వింటాల్ మిర్చి రూ.39 వేలు!.. కళకళలాడుతున్న వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్

**వరంగల్ బ్యూరో, మహా:** రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. రైతన్న పండించిన ఎర్రబంగానికి మునుపెన్నడూ లేని విధంగా మంచి ధరలు పలుకుతున్నాయి. వరుస సెలవుల తర్వాత మార్కెట్ తిరిగి తెరుచుకోవడంతో రైతులు భారీగా మిర్చి పంటను విక్రయానికి తీసుకువచ్చారు. దీంతో మార్కెట్ ప్రాంగణమంతా ఎర్ర బంగారంతో నిండిపోయి కళకళలాడుతోంది. ప్రధాన రకాలైన తేజ, సింగిల్ పట్టీ, వండర్ హాట్ రకాలకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ నెలకొంది. వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల మిర్చికి మార్కెట్‌లో రికార్డు స్థాయి ధరలు నమోదయ్యాయి. అత్యధికంగా టమాటా రకం మిర్చి క్వింటాల్‌కు ఏకంగా రూ.39 వేలు పలికి రికార్డు సృష్టించింది. అలాగే వండర్ హాట్ రకం మిర్చి సైతం ఘాటైన ధరను నమోదు చేస్తూ క్వింటాల్‌కు రూ.35 వేలు పలకగా, ఎల్లో రకం మిర్చికి రూ.26 వేల ధర దక్కింది. వీటితో పాటు 341 మిర్చి రకానికి రూ.20 వేల 500, తేజ రకం మిర్చికి రూ.19 వేల 500 చొప్పున వ్యాపారులు చెల్లించి కొనుగోలు చేశారు. ఆశించిన దానికంటే మెరుగైన ధరలు దక్కుతుండటంతో కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని మిర్చి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఇరాన్‌తో యుద్ధానికి బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

అగ్రరాజ్యం, ఇరాన్ మధ్య నెలకొన్న శత్రుత్వానికి పూర్తి స్థాయి ముగింపు పలికే దిశగా అడుగులు పడుతున్నాయని, అందుకే దాడులను తాత్కాలికంగా వాయిదా వేయాలని రక్షణ శాఖను ఆదేశించినట్లు ట్రంప్ వివరించారు. పశ్చిమాసియాలో శాంతి సామరస్యాల కోసం అమెరికా ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఒకవైపు గ్లోబల్ ఆయిల్ మార్కెట్లు సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ, ఇరాన్‌పై దాడుల వాయిదా వార్త ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా ఇంధన మార్కెట్లకు భారీ ఊరటనిచ్చింది.

## 13 శాతం తగ్గిన చమురు ధరలు

ఇరాన్‌పై సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒకే ఒక్క ప్రకటన అంతర్జాతీయ మార్కెట్లలో ఒక్కసారిగా మార్పులొచ్చాయ్. రోజుల వ్యవధిలోనే ఆకాశాన్ని తాకిన ముడి చమురు ధరలు ఈ సానుకూల పరిణామంతో అమాంతం దిగివచ్చాయి. ఇరాన్‌అమెరికా ఘర్షణలతో చమురు సరఫరా పూర్తిగా నిలిచిపోతుందన్న భయంతో భగ్గుమన్న ధరలకు.. తాజా ప్రకటనతో ఒక్కసారిగా బ్రేక్ పడింది. దీని ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఏకంగా 13 శాతం మేర భారీగా పతనమైంది. వంద డాలర్లు దాటేసి భయాందోళనలు రేకెత్తించిన బ్రెంట్ క్రూడ్, తాజా పరిణామాలతో ఒకేసారి 17 డాలర్ల మేర క్షీణించి 96 డాలర్ల స్థాయికి పడిపోయి సెంచరీ మార్కు దిగువకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌తో పాటే వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ముడి చమురు ధరలు సైతం ఊహించని రీతిలో పతనమయ్యాయి. మార్కెట్ వర్గాల అంచనాలను తలకిందులు చేస్తూ డబ్ల్యూటీఐ బ్యారెల్ ధర ఒక్కసారిగా 13 డాలర్లు క్షీణించి 85 డాలర్ల స్థాయికి చేరుకుంది. గత కొద్ది రోజులుగా ఇరాన్ చమురు నిల్వలు, ప్రాసెసింగ్ కేంద్రాలపై అమెరికా దాడులు చేస్తుందన్న వార్తలతో గ్లోబల్ ఆయిల్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకుంటుందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. అయితే, ట్రంప్ తాజా నిర్ణయంతో దౌత్యపరమైన చర్చలకు మార్గం సుగమం కావడంతో పాటు ముడి చమురు ఉత్పత్తి, సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదన్న భరోసా పెట్టుబడిదారుల్లో నెలకొంది. దీంతో రికార్డు స్థాయికి చేరిన చమురు ధరలు చల్లబడి, ఇంధన దిగుమతులపై ఆధారపడిన భారత్ లాంటి దేశాలతో పాటు సామాన్య ప్రజలకు కూడా ఇది పెద్ద ఊరటనిచ్చింది.

# ద్వేషపూరిత ప్రసంగాలపై ఉక్కుపాదం

## చెప్పినట్లే బిల్లు తెస్తున్న సీఎం రేవంత్.. కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, మహా:** ద్వేషపూరిత ప్రసంగాలపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్రసర్కారు నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**కేబినెట్ నిర్ణయాలు ఇవే**

విద్వేషపూరిత ప్రసంగాలు.. విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు (తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026) ను మంత్రివర్గం ఆమోదించింది. మత సామరస్యాన్ని భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు ఘర్షణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు. వారిపై కేసులు నమోదు చేయడం, కఠిన చర్యలు తీసుకుంటారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తం ప్రతి నెల వేతనాల నుంచి పరిహరిస్తారు. ఆ మొత్తాన్ని తల్లిదండ్రులకు అందజేసే తల్లిదండ్రుల మద్దతు బిల్లును కేబినెట్ ఆమోదించింది. ప్రస్తుతం సమాజంలో అనేక మంది పిల్లలు తల్లిదండ్రుల యోగక్షేమాలను పట్టించుకోవడంలేదని ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ , ప్రైవేటు ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్ట సభల ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వారి తల్లిదండ్రుల నుంచి వేతనాలను కట్ చేయనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌కు అధికారం అప్పగించారు. రాష్ట్ర స్థాయిలో కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ స్థాయిలో నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం అయినా మరే ఇతర కారణాలు అయితే రాష్ట్ర స్థాయిలో కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. వృద్ధుల సంక్షేమ శాఖ ఈ చట్టాన్ని అమలు చేయనుంది. తల్లిదండ్రులను యోగక్షేమాలను పట్టించుకోకుంటే వేతనాల్లో కోత విధించడం దేశంలో పంజాబ్ తరువాత మన రాష్ట్రంలో అమలు చేయనున్నారు.

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం.. భద్రత కోసం రూపొందించిన "తెలంగాణ ప్లాట్ ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్ , సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ) యాక్ట్ , 2026" బిల్లును ఆమోదించిన కేబినెట్. రాష్ట్రంలో దాదాపు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్స్, ప్లాట్‌ఫారం బేస్డ్ వర్కర్స్ ఉన్నారు. కొత్త బిల్లు ప్రకారం వర్కర్స్ రిజిస్ట్రేషన్ తో పాటు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు, సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ బిల్లు ప్రకారం.. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు వారి సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయడంతో వారి హక్కులకు రక్షణ లభిస్తుంది. గతంలో మంత్రివర్గం ఆమోదించిన బిల్లును ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్‌కు అనుగుణంగా స్వల్ప మార్పులతో కేబినెట్ ఆమోదించింది. తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదుల పై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించారు. గతంలో జరిగిన అడ్వకేట్ దంపతులు వామనరావు హత్యల నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ, తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు ఉద్దేశించిన రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మంత్రివర్గం ఉప సంఘం సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లను నియమించారు.

హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న 69 కిలోమీటర్ల మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రుణభారం సహా మొత్తం రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం ఎల్ అండ్ టీకి చెల్లించి ఫేజ్ -1 ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సబ్ కమిటీ నివేదికను సమర్పించింది . ప్రభుత్వం తరపున ఈ నిధుల చెల్లింపులు, లావాదేవీల బాధ్యతను నిర్వర్తించే బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కు అప్పగించింది. హెచ్‌ఎంఆర్‌ఎల్‌ను నోడల్ ఏజెన్సీ గా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదికను కేబినెట్ ఆమోదించింది. ఇండిపెండెంట్ ఎక్స్పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఈ నివేదిక తయారు చేశారు. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను కేబినెట్ చర్చించింది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది.

# దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు

### ఏప్రిల్ 16కు వాయిదా


**హైదరాబాద్, మహా:** దానం నాగేందర్ కు తెలంగాణ హైకోర్ట్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల కేసులో స్పీకర్ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ తీర్పును కొట్టివేయాలని, దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం కోర్టులో విచారణ జరిగింది. మహేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ నుంచి లోకసభ ఎన్నికల్లో దానం నాగేందర్ పోటీ చేశారని కోర్టుకు తెలిపారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజే అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో ఇలాంటి కేసులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను న్యాయవాది ప్రస్తావించారు. స్పీకర్ తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఏజీగా ఉండి స్పీకర్ తరపున ఎలా వాదిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. తాను సీనియర్ న్యాయవాదిగా హాజరవుతున్నానని సుదర్శన్ రెడ్డి తెలిపారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి, దానం నాగేందర్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

# మూసీ ప్రక్షాళన ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

ఆ సూచనలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన ఓ మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తున్నట్లు సీఎం సభలో అధికారికంగా ప్రకటించారు.

దేశంలోని ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు ఎదుర్కొంటున్న విషమ పరిస్థితులను సీఎం ఈ సందర్భంగా ఉదహరించారు. దేశ రాజధాని ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం, ఆర్థిక రాజధాని ముంబైలో వర్షాలొస్తే మునిగిపోయే పరిస్థితి, బెంగళూరులో ట్రాఫిక్ జామ్‌లు, భారీ వర్షాలకు చెన్నైలో పడవలపై ప్రయాణించాల్సిన దుస్థితిని మనం చూస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. భౌగోళికంగా ఎలాంటి లోపం లేని, ప్రశాంత వాతావరణం ఉన్న చారిత్రక హైదరాబాద్ నగరం నేడు కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతోందంటే అది ముమ్మాటికీ మానవ తప్పిదమేనని ఆయన విశ్లేషించారు. కుతుబ్ షాహీల కాలం నాటి గుల్జార్ హౌజ్, ఫలక్‌నుమా, ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు వంటి ఎంతో చరిత్ర కలిగిన అద్భుతమైన కట్టడాలతో ఒకప్పుడు 'లేక్ అండ్ రాక్ సిటీ'గా విలసిల్లిన నగరానికి ఆ పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భవిష్యత్ ప్రణాళికలను రేవంత్ రెడ్డి సభకు వివరించారు. రాష్ట్రాన్ని క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు ప్రాంతాలుగా విభజించి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. దాదాపు 1.34 కోట్ల జనాభా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించామని, కాలుష్యానికి కారణమయ్యే రెడ్, ఆరెంజ్ జోన్ పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించి, ఈ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం 'హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని, దీని ద్వారా పాత పారిశ్రామిక భూములను మల్టీయూజ్ జోన్లుగా మార్చుతామని వివరించారు. తద్వారా వాటి యాజమాన్య హక్కులు మారకుండానే ఆ ప్రాంతాలు మధ్యతరగతి నివాస యోగ్యంగా మారతాయని చెప్పారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చే ప్రణాళికలో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల జలాలను తీసుకువస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందులో 17 టీఎంసీలను జంటనగరాల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తామని, మిగిలిన 3 టీఎంసీల నీటిని మూసీ నదిలో నిరంతరం ప్రవహించేలా పంపుతామని ముఖ్యమంత్రి సభకు సవివరంగా తెలియజేశారు.



# కాళ్లు మొక్కుతా.. పాస్ చేయండి సార్!

(మొదటిపేజీ తరువాయి)

కొందరు విద్యార్థులు జవాబులు రాక సినిమా కథలు రాస్తే, మరికొందరు జాలి చూపి పాస్ చేయాలంటూ రకరకాల లేఖలు రాస్తుంటారు. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పరిధిలోని ఒక ఇంటర్మీడియట్ విద్యార్థి రాసిన ఇలాంటి ఓ సమాధాన పత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సదరు విద్యార్థి జవాబులు రాయడానికి బదులు.. తనను పాస్ చేయాలంటూ ఏకంగా గురువు కాళ్లు మొక్కుతున్నట్లు ఓ బొమ్మ గీసి, దాని పక్కనే ఓ భావోద్వేగమైన లేఖను రాసుకొచ్చాడు. "సార్ నన్ను పాస్ చేయండి సార్. నన్ను పాస్ చేస్తే మీరు మేలు చేసిన వారవుతారు. బార్డర్ పాస్ అయినా చేయండి. మీ కాళ్లు మొక్కుతా సార్" అంటూ ఆ విద్యార్థి జవాబు పత్రంలో వేడుకున్నాడు. తాను చదివిన ప్రశ్నలు పరీక్షలో రాలేదని, అందుకే ఇలా రాయాల్సి వస్తోందని పేర్కొన్నాడు. అంతేకాకుండా, ఎగ్జామినర్‌ను ప్రసన్నం చేసుకునేందుకు పేపర్లో "గురువే దైవం, గురువే ధైర్యం, గురువు కష్ట పడేవాడికి తోడు ఉంటాడు" అంటూ కొన్ని సూక్తులు కూడా రాశాడు. గురువు నిలబడి ఉండగా.. కింద పడుకుని ఆయన కాళ్లకు నమస్కరిస్తున్నట్లు పెన్‌తో ఒక బొమ్మను సైతం గీశాడు. పేపర్ దిద్దే సమయంలో సదరు ఎగ్జామినర్ ఈ జవాబు పత్రాన్ని ఫొటో తీయగా.. అది కాస్తా ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ ఆన్సర్ షీట్ చూసిన నెటిజన్లు ఆ విద్యార్థి అమాయకత్వానికి నవ్వుకుంటూనే, పాపం పాస్ చేయొచ్చు కదా సార్ అంటూ సరదాగా కామెంట్లు పెడుతున్నారు.

# నేను సీఎం అయిత

**హైదరాబాద్, మహా :** మాజీ మంత్రి, మేడ్చల్ మల్లారెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో చిట్ చాట్ లో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాలపై తనకున్న ఆసక్తి, సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న బంధంపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. టాలీవుడ్ డైరెక్టర్ హరీష్ శంకర్ తనను ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో విలన్ పాత్ర కోసం అడిగారని వెల్లడించారు. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఆ సినిమాలో విలన్‌గా చేయమని డైరెక్టర్ కోరినట్లు తెలిపారు. అయితే తాను ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించానని చెప్పకొచ్చారు. తనకు వెండితెరపై ఒక్కసారైనా సీఎం పాత్ర పోషించాలనే కోరిక ఉందని అన్నారు. అలాంటి అవకాశం వస్తే తప్పకుండా సినిమాలో సీఎంగా నటిస్తానని తన మనసులోని మాటను బయటపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకున్న సంబంధంపైనా కీలక కామెంట్స్ చేశారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది పరోక్షంగా తాననేని అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ కన్నా దమ్మున్న నాయకుడు మరొకరు లేరని, ఈ విషయాన్ని రెడ్డి సంఘం మీటింగ్‌లోనే చెప్పానని అన్నారు. అవసరమైతే అందుకు సంబంధించిన వీడియో కూడా చూపిస్తానని మల్లారెడ్డి వెల్లడించారు. ఎవరు ఏమన్నా తామిద్దరం అన్నదమ్ములమన్నారు. మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా రేవంత్ రెడ్డి గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**కాంగ్రెస్ పై ఖర్చీఫా?**

గతంలో మల్లారెడ్డి, రేవంత్ రెడ్డి ఒకే పార్టీలో పని చేశారు. 2014 సమయంలో మల్లారెడ్డి మల్కాజిగిరి ఎంపీగా టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత ఆయన సైకిల్ దిగి కారెక్కారు. ఇక రేవంత్ రెడ్డి ఆ సమయంలో కొడంగల్ టీడీపీ ఎమ్మెల్యేగా కొనసాగారు. ఆ తర్వాత ఆయన కూడా పలు రాజకీయ కారణాల వల్ల టీడీపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికై తనదైన రాజకీయ చతురతతో తెలంగాణకు రెండో సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. ఇదిలా ఉండగా.. గత కొన్నిరోజులుగా మల్లారెడ్డి కారు పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో రేవంత్, తాను అన్నదమ్ములం అంటూ మల్లారెడ్డి చేసిన కామెంట్స్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# సింగర్ మంగ్లీ క్లారిటీ

### ఆ స్కాంతో నాకు సంబంధం లేదు

**హైదరాబాద్, మహా:** సింగర్ మంగ్లీ పేరుతో కొందరు అధిక వడ్డీ ఆశ చూపించి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు రాగా, సదరు బాధితులు కేసు పెట్టడంతో పాటు లాయర్ ఈ విషయంపై ప్రెస్‌మీట్ కూడా నిర్వహించారు. దాదాపు రూ.150 కోట్ల మైక్రో ఫైనాన్స్ స్కామ్ జరిగిందని.. ఈ కేసులో సింగర్ మంగ్లీ తమ్ముడు శివ కూడా ఉన్నారని, మంగ్లీ పేరు చెప్పి ఓ పబ్ నిర్మాణం కూడా చూపారని ఆరోపించారు. వీటిపై మంగ్లీ సోషల్ మీడియా ద్వారా సోమవారం క్లారిటీ ఇచ్చింది. 'మైక్రో ఫైనాన్స్ పేరిట నా పేరుతో డబ్బులు వసూలు చేశారంటూ వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాను. నాకు ఆ వ్యక్తులకు ఎలాంటి సంబంధం లేదు. షో, ప్రొఫైల్ ఈవెంట్స్ కోసం రోజూ చాలా మంది నన్ను, నా తమ్ముడిని కలుస్తుంటారు. అంతే తప్ప నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. కేవలం ఈవెంట్లు మాత్రమే నిర్వహిస్తున్నాను. కావాలనే కొందరు నా వ్యక్తిగత పరువుకు భంగం కలిగించేలా నా పేరును ఇలాంటి కేసుల్లోకి లాగుతున్నారు. ఇది చాలా అన్యాయం. ఆ వ్యాపారాలతో నాకు, నా కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధాలు లేవు. నా పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నారంటే అస్సలు నమ్మొద్దు. అలాంటి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు వారిని కోరుతున్నాను' అని మంగ్లీ చెప్పారు.

## క్యూనెట్‌పై పోలీసుల పంజా..
# వందల కోట్ల స్కామ్!

**హైదరాబాద్, మహా:** మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో అమాయక ప్రజలను బురిడీ కొట్టించి, వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన ప్రముఖ సంస్థ 'క్యూనెట్ (QNet)' వ్యవహారాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. క్యూనెట్ మోసాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో హైదరాబాద్ సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులు భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. సోమవారం తెల్లవారుజాము నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని క్యూనెట్ కార్యాలయాలు, కీలక బాధ్యుల ఇళ్లపై ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సంస్థపై సీసీఎస్‌లో ఇప్పటికే ఆరు కేసులు నమోదు కాగా, తాజాగా మోసపోయిన బాధితుల ఫిర్యాదులతో మరో రెండు కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసు బృందాలు.. మూడు రాష్ట్రాల్లోని మొత్తం 25 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలోనే ఏకంగా 6 ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, అలాగే కర్ణాటకలోని బెంగళూరు నగరాల్లోనూ క్యూనెట్ లింకులపై జల్లెడ పడుతున్నారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించి మొత్తం 20 మంది కీలక నిందితులను పోలీసులు ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. ప్రజలను పెట్టుబడుల పేరుతో ఆకర్షించి భారీగా దోచుకున్న వందల కోట్ల రూపాయలను ఎక్కడెక్కడ మళ్లించారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఈ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

# సీఎంతో రాజగోపాల్ రెడ్డి భేటీ

### పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ టాపిక్

(మొదటిపేజీ తరువాయి)


తాజాగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జగ్గారెడ్డిపై చేసిన వ్యాఖ్యలు, సినిమా ఈవెంట్ కు హాజరుకాకపోవడం వంటివి చర్చకు దారితీశాయి. త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ చర్చలు జరుగుతున్న నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి సీఎంతో భేటీ కావడంపై ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇటీవల రాజగోపాల్ రెడ్డితో పలువురు ఎమ్మెల్యేలు భేటీ అయిన వార్తలు కూడా వచ్చాయి. రకరకాల చర్చలు జరుగుతున్న నేపథ్యంలో సీఎంతో రాజగోపాల్ రెడ్డి స్పష్టత తీసుకున్నారని, ఒక రోజు ముందో వెనుకో తాను ఇచ్చిన ప్రతిమాట నిలుపుకున్నానని సీఎం రేవంత్ స్పష్టం చేసినట్లు తెలిసింది. త్వరలో జరిగే విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమని ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఇటీవల నల్లగొండ జిల్లాకే చెందిన వేముల వీరేశంకు విప్ పదవి కూడా ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ ఖాళీ బెర్త్ లతో పాటు చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులపై చర్చలు ప్రారంభించినట్లు వినబడుతోంది.

# ఈసీ లేఖపై కమలం ముద్ర!

## కేరళలో రేగిన రాజకీయ దుమారం..

### ఎన్నికల సంఘం, భాజపా ఒక్కటేనంటూ సీపీఎం ధ్వజం..

### సిబ్బంది పొరపాటేనని వివరణ ఇచ్చిన సీఈవో



ELECTION COMMISSION OF INDIA
Nirvachan Sadan, Ashoka Road, New Delhi –110 001

No. 3/4/2019/SDR/Vol-I Dated: 19th March, 2019

To,
The Chief Electoral Officers of
All States and UTs

Subject:- FAQs on Criminal Antecedents, if any, of a candidate and its publicity in pursuance of Hon'ble Supreme Court Judgment dated 25/09/2018 in W.P.(C) No. 536 of 2011- regarding.

Sir/Madam,


I am directed to invite your reference to the Commission's directions in letter of even No. dated 10/10/2018 issued in pursuance of Hon'ble Supreme Court Judgment dated 25/09/2018 in W.P.(C) No. 536 of 2011. In view of the various queries raised in this regard, a set of FAQs and clarifications in this regard is enclosed.

2. The FAQs may be circulated to all DEOs, Returning Officers, officers connected to elections and the Political Parties based in your State, for their information.

3. In the Commission's abovementioned letter, it has been inter alia, directed that after the election the candidates shall submit a report about publishing of declaration to the DEO and the Political parties to the CEO of the State. The Commission has provided formats C-4 and C-5 for this purpose. The formats are also enclosed. These shall also be circulated to the DEOs, ROs and all political parties based in the State.

Yours faithfully,
(N.T. Bhutia)
Secretary

Copy to: All Recognized National and State Political Parties




**హైదరాబాద్, మహా:** భారత ఎన్నికల సంఘం (ఈసీ) రాజకీయ పార్టీలకు పంపిన ఓ అధికారిక లేఖపై ఏకంగా భారతీయ జనతా పార్టీ (భాజపా) కేరళ శాఖకు చెందిన సీలు ఉండటం రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారానికి దారితీసింది. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై విపక్షాలు తీవ్ర స్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించాయి. ఈసీకి, భాజపాకు మధ్య ఏదో రహస్య బంధం ఉందని, రెండు వ్యవస్థలూ ఒకే కేంద్రం నుంచి నియంత్రించబడుతున్నాయని వామపక్ష పార్టీ సీపీఐ(ఎం) ఆరోపించింది. వివాదం ముదరడంతో స్పందించిన ఎన్నికల సంఘం.. ఇది కేవలం క్లరికల్ (సిబ్బంది) పొరపాటు మాత్రమేనని, ఆ తప్పును ఇప్పటికే సరిదిద్దామని సోమవారం అధికారికంగా వివరణ ఇచ్చుకుంది.

**సిబ్బంది అజాగ్రత్తే కారణం: సీఈవో కేల్కర్**

ఈ వివాదంపై కేరళ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) రతన్ యు కేల్కర్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్టీ సీలు పడటం అనేది పూర్తిగా సిబ్బంది అజాగ్రత్త, పొరపాటు వల్ల జరిగిందేనని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థుల నేర చరిత్రకు సంబంధించి 2019 నాటి మార్గదర్శకాలపై వివరణ కోరుతూ కేరళ భాజపా యూనిట్ ఇటీవల తమ కార్యాలయాన్ని సంప్రదించిందని, ఆ సమయంలో భాజపా సమర్పించిన పత్రంపై ఆ పార్టీ అధికారిక సీలు ఉందని వివరించారు. సిబ్బంది అజాగ్రత్త వల్ల, ఒరిజినల్ అధికారిక ప్రతికి బదులుగా పొరపాటున భాజపా స్టాంప్ ఉన్న కాపీనే ఇతర రాజకీయ పార్టీలకు పంపడం జరిగిందని కేల్కర్ తెలిపారు. ఈ క్లెరికల్ పొరపాటును గుర్తించిన వెంటనే, డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మార్చి 21న ఓ నోటీసు జారీ చేసి సదరు పత్రాన్ని ఉపసంహరించుకున్నారని వెల్లడించారు. ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు సైతం తెలియజేశామన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి బాహ్య శక్తుల జోక్యం లేకుండా కమిషన్ పటిష్టమైన వ్యవస్థను నిర్వహిస్తోందని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ఆయన కోరారు. ఈ ఘటనపై విచారణ పూర్తయ్యే వరకు, ఆ ఫైలును పర్యవేక్షించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్లు కేల్కర్ ప్రకటించారు.

**ఏ బటన్ నొక్కినా కమలమేనా?: సీపీఎం**

ఈ లేఖ వ్యవహారంపై అధికార సీపీఐ(ఎం) తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో తీవ్ర విమర్శలు గుప్పించింది. "భాజపా తన ముసుగులన్నీ తొలగించిందా? భారత ఎన్నికల సంఘం, భాజపా రెండూ ఒకే కేంద్రం నుంచి నడుస్తున్నాయనేది బహిరంగ రహస్యమే. కనీసం రెండు వేర్వేరు డెస్క్‌లు ఉన్నాయనే మర్యాదనైనా పాటించండి. ఇప్పుడు అది కూడా అవసరం లేదనిపిస్తోంది. ఎన్నికల కమిషన్ లేఖపై భాజపా సీలా! ఏ బటన్ నొక్కినా కమలం గుర్తువస్తుందనే పాత ఆరోపణలాగే, ఇది కూడా మరో కాకతాళీయంగా జరిగిందని అనుకోవాలా?" అంటూ ఎద్దేవా చేసింది.

# మెహిదీపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో అగ్నిప్రమాదం




- మూడో అంతస్తులో పేలిన ఏసీ!
- ప్రాణభయంతో బయటకు పరుగులు తీసిన రోగులు, సిబ్బంది..
- తృటిలో తప్పిన పెను విషాదం.

**హైదరాబాద్, మహా:** నగరంలోని మెహిదీపట్నం సమీపంలో ఉన్న విజయనగర్ కాలనీలో సోమవారం అగ్నిప్రమాదం తీవ్ర కలకలం రేపింది. స్థానికంగా ఉన్న ప్రముఖ 'శృతి మల్టీస్పెషాలిటీ' ప్రైవేటు ఆసుపత్రిలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పేషెంట్లు, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆసుపత్రి భవనంలోని మూడో అంతస్తులో అమర్చిన ఏసీ (ఎయిర్ కండీషనర్) యంత్రంలో షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ శబ్దంతో పేలిపోవడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ఏసీ పేలిన వెంటనే ఆ వార్డు చుట్టుపక్కల దట్టమైన నల్లటి పొగలు, అగ్నికీలలు వేగంగా వ్యాపించాయి. పెద్ద శబ్దం రావడంతో పాటు, ఒక్కసారిగా మంటలు, పొగలు కమ్ముకోవడాన్ని గమనించిన ఆసుపత్రి సిబ్బంది, వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని తీవ్ర భయాందోళనలకు గురై, ఎక్కడికక్కడ వస్తువులను వదిలేసి కిందకు పరుగులు తీశారు. అప్పటికప్పుడు రోగులను బయటకు తీసుకురావడంతో పెను ప్రాణాపాయం తప్పింది. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. భవనం మూడో అంతస్తులోకి చొరబడి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆసుపత్రి వద్ద భారీగా జనం గుమికూడటంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# బోనస్ బోగస్ అయ్యింది

### అసెంబ్లీలో హరీష్ రావు ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో నిధులు కేటాయించి వాటిని కేటాయించడం లేదని ఫైర్ అయ్యారు.

**నిరుద్యోగులకు మోసం**

కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను దారుణంగా వంచించిందని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో హరీశ్ రావు మహాకవి శ్రీశ్రీ కవితను ప్రస్తావించారు. 'కూటి కోసం కూలి కోసం పట్టణంలో బతుకుదామని బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం ఎంత కష్టం' అంటూ గతంలో భట్టి విక్రమార్క తమ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారని గుర్తు చేశారు. ఇప్పుడు నిరుద్యోగుల పరిస్థితి అలాగే ఉందని పేర్కొన్నారు. అశోక్ నగర్ వెళ్లి చూస్తే నిరుద్యోగులు ఎంత కష్టపడుతున్నారో అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# గవర్నర్‌ను కలిసిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మార్చి 27న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణమహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖాధికారులతో కలిసి అందజేశారు. భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం యొక్క విశిష్టత గురించి కొండా సురేఖ గవర్నర్ కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరిగే పవిత్ర వేడుకని, ఈ మహోత్సవానికి దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అర్చకులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు



**మహా, సదాశివపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని రాష్ట్ర బిజెపి పార్టీ సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది.అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడానికి సిద్ధమవుతున్న సదాశిపేట బిజెపి మండల పట్టణ నాయకులను , కార్యకర్తలను పోలీసులు ఉదయమే వారి ఇంటికి వెళ్లి అరెస్టు చేసి సదాశివపేట పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చకపోవడంపై బీజేపీ నాయకులు మండల పట్టణ అధ్యక్షులు కర్ణం ఆదిత్య, శ్రీనివాస్ మండిపడుతున్నారు. తమ నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరెస్టులు చేసినప్పటికీ, అసెంబ్లీ ముట్టడికి వెనకడుగు వేయబోమని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.రాష్ట్ర నాయకులు మాణిక్ రావ్ ,నెమలికొండ వేణుమాధవ్, శ్రీశైలం యాదవ్, కోవూరు సంగమేశ్వర్,లింగం పలువురు నాయకులు కార్యకర్తలను అరెస్టు చేశారు.

## రైతుల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం...

**శనిగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి**




**మాహా :**సదాశివపేట రైతుల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం అని సి డి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మార్క్ఫెడ్ ద్వారా నాఫెడ్ వారిచే శనగల కొనుగోలు కేంద్రం డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రం సదాశివపేట్ నందు ఏర్పాటు చేశారు ఇట్టి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సిడిసి చైర్మన్. గడిల రాంరెడ్డి హాజరై ప్రారంభత్సవము చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులపక్షపాతి అని వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకే కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్.మునిపల్లి సత్యనారాయణ. మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ కంది కృష్ణ. మండల పార్టీ అధ్యక్షులు చాట్ల సిద్ధన్న. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివకుమార్. యూసుఫ్. తెలంగాణ మంజీర రైతు సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్.కిసాన్ సంగ్ అధ్యక్షులు నరసింహ రెడ్డి. రైతుసంఘం నాయకులు రవీందర్ , వెంకట్రావ్ , రాంరెడ్డి. డీసీఎంఎస్ అధికారులు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో రాజు కంప్యూటర్స్ అధినేత మృతి..



**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలో రాజు కంప్యూటర్స్ నిర్వాహకుడు ఓబులాపూర్ రాజు(44) సోమవారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందారు. వేణు రెస్టారెంట్ సమీపంలో ఉన్న తన కంప్యూటర్ ఇన్స్టిట్యూషన్‌కు వచ్చిన ఆయన తరగతి నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు.అప్రమత్తమైన స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మృతి వార్త మణుగూరు ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మరణవార్త తెలుసుకున్న పలువురు నాయకులు, ప్రముఖులు, న్యాయవాది, సామాజిక కార్యకర్త కర్నె రవి, న్యాయవాది గౌడుగునూరి నాగార్జున రెడ్డి, అశోక్ గాంధీనగర్‌లోని రాజు నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పేదల కోసం కంప్యూటర్ విద్య అందించడంలో రాజు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన లోటు తీరనిదని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## రైతు భరోసా నిధుల విడుదలకు కృతజ్ఞతలు..



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా నిధులను విడుదల చేసిన సందర్భంగా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేల సమన్వయంతో ఈ భేటీ జరిగింది. రైతుల సంక్షేమం దృష్ట్యా రైతు భరోసా నిధులను విడుదల చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలు, రైతుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

## అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు రావాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రాజీలేని పోరాటం
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి
- కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కార్మిక హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలే శరణ్యమని ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తోందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కనీస వేతనం అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని అడ్డుకోవాలని కార్మిక శ్రేణులు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి రావాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా చలో అసెంబ్లీ, కలెక్టరేట్ ముట్టడి వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఏఐటీయూసీ జాతీయ రాష్ట్ర జిల్లా మండల స్థాయి మహాసభలకు ఏఐటీయూసీ నాయకులు కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, దేవరకొండ శంకర్, వంగ వెంకట్, జి.వీరాస్వామి, గెద్దాడు నగేష్, గౌనె మని, వేల్పుల మల్లికార్జున్, ఎండి నజీర్ అహ్మద్, పిట్టల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన దేశభక్తుడు భగత్ సింగ్

- డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు బండారు రమేష్
- భగత్ సింగ్ స్ఫూర్తితో యువత దేశభక్తిని చాటాలి
- సత్తుపల్లి పట్టణ ఎస్ఐ పల్లెల ప్రదీప్
- సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు



**సత్తుపల్లి, మహా:** రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం కబంధ హస్తాల నుండి భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడానికి అతి పిన్న వయసులోనే ఆంగ్లీయులపై ఉద్యమించి ఉరితాడును సైతం ముద్దాడిన దేశభక్తుడు భగత్ సింగ్ అని డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు బండారు రమేష్ అన్నారు. భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బండారు రమేష్ మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజవాదుల గుండెల్లో వణుకు పుట్టించిన ఘనుడు భగత్ సింగ్ అని, భారతదేశ స్వాతంత్ర సాధనలో ఆయన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. పట్టణ ఎస్ఐ ప్రదీప్ మాట్లాడుతూ స్వదేశ బానిసత్వాన్ని పారదోలడానికి భగత్ సింగ్ చేసిన పోరాటం భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని, నేటి యువత భగత్ సింగ్ ధైర్య సాహసాలను అందిపుచ్చుకొని చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రజల శ్రేయస్సు కోరే ఉన్నత సిద్ధాంతాల కోసం పోరాడాలని సూచించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగుల్ పాషా, వ్యకాస డివిజన్ అధ్యక్షులు జాజిరి శ్రీనివాస్, ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి మాట్లాడుతూ దేశభక్తుల వర్ధంతిని స్మరించుకోవడమే కాకుండా వారి త్యాగాలను నేటి మన అనుదిన జీవితాలలో ఇనుమడింపజేసుకొని కుల మత, ఆర్థిక విద్వేషాలపై పోరాటం చేసి శ్రమజీవులకు బాసటగా నిలవాలని హితవు పలికారు. ఈ సభలో గ్రామ సర్పంచ్ పొదిలి మారేశ్వరరావు, డివైఎఫ్ఐ డివిజన్ నాయకులు తడికమళ్ళ రామకృష్ణ, నాయకులు బండి వేలాద్రి, కొవ్వారపు లక్ష్మణరావు, అయినంపూడి సదానంద రావు, కండే సత్యం, మిట్టపల్లి నాగమణి, జానపాటి అశోక్, చిన్న స్వామి, దాట్ల రాంబాబు, బెజవాడ నరేంద్ర, కుంజా శ్రీలత, రోజా, ఆంగోతు చిట్టెమ్మ, తోటకూర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు చిన్న అరుణాచలేశ్వర ట్రస్ట్ చేయూత



**మహా, దుమ్ముగూడెం:** మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను నరసాపురం చిన్న అరుణాచలం దేవాలయం ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి అండగా నిలిచి బాధిత కుటుంబానికి 7000 విలువగల నిత్యవసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో అరుణ సేవాగణాలు బాలకృష్ణ రమాదేవి రూపవాణి లలిత తదితరులు పాల్గొన్నారు

## బిజెపి మతోన్మాదాన్ని నిలువరించడమే భగత్ సింగ్‌కు అసలైన నివాళి


**సిఐటియు కొత్తగూడెం టౌన్ కన్వీనర్.. భూక్య రమేష్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అమెరికా సామ్రాజ్యవాదం బిజెపి మతోన్మాదాన్ని నిలువరించడమే భగత్ సింగ్ కు అసలైన నివాళి అని సిఐటియు కార్మిక సంఘం కొత్తగూడెం టౌన్ కన్వీనర్ భూక్య రమేష్ అన్నారు. భగత్ సింగ్ రాజ గురు, సుఖదేవ్ ల 95 వ వర్ధంతి సందర్భంగా సిఐటియు కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పలు ప్రాంతాల్లో వర్ధంతి సభలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలు కార్మిక ప్రాంతాల్లో జరిగిన సభలో సిఐటియు కొత్తగూడెం పట్టణ కన్వీనర్ భూక్య రమేష్ పాల్గొని మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం కోసం నిరంతరం పోరాటం చేస్తూ యువకిశోరాలుగా చరిత్ర ఉన్నంతకాలం నిలిచిపోతారన్నారు. అటువంటి మహత్తరమైన అమరజీవులు యువతకు ఆదర్శంగా నిలిచినారని అన్నారు. మహనీయుల బాటలో నేటి యువ కార్మికులు అందరూ నడవాలని ఆకాంక్షించారు. భారతదేశంలో మతోన్మాద బిజెపి పరిపాలన ఉండటంవల్ల ప్రజలు అనైక్యతతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆప్రజాస్వామ్య పద్ధతుల్లో బిజెపి పరిపాలన కొనసాగుతుందని అందుకే మత ఘర్షణలతో భారత ప్రజలు కులమతాల అగ్నికిలలలో దహనం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల మతాల కొట్లాటలు లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగా అందరూ సమానమని భావనతో భారత ప్రజలు ఉండాలని ఆకాంక్షించిన మొట్టమొదటి యువకిశోరం భగత్ సింగేనని ఆయన అన్నారు. సామ్రాజ్యవాధాన్ని కూకట్వేళ్లతో పెకిలించాలని అనేక పోరాటాల నిర్మించి తెల్లదొరలను ఎదురొడ్డి నిలిచిన భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ లను వారి పోరాట పట్టిమ నేటికీ ఆదర్శప్రాయం అన్నారు. వారే బ్రతికుంటే భారత యువకులు ప్రజలు తిరుగుబాటు చేస్తారనే భయంతో ఉరిశిక్ష విధించి అతి దారుణంగా వారి మరణానికి కారణం అయిన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్యాన్ని సాధించి తీరాలని అనేకమంది ప్రజలు నడుం బిగించి తీసుకువచ్చిన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని తెలిపారు. ఆ ముగ్గురు యువ కిశోరాల అమరత్వంతో నేటి యువత ధైర్యాన్ని ప్రశ్నించే తత్వాన్ని విప్లవ చైతన్యాన్ని పునికి పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. నేటి యుద్ధాలకు కారణం అవుతున్న అమెరికా గుత్తాధిపత్యాన్ని ఎదిరించి సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టాలని బిజెపి మతోన్మాదం నుండి ప్రజలను రక్షించాలని ఆయన అన్నారు. నేటి పాలకవర్గాలను వారి పాలనను అధ్యయనం చేసి ప్రజలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షులు గిద్ద శ్యామ్ కుమార్, గూగులోత్ సక్రాం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల పారదర్శకతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఇన్విజిలేటర్లు సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వర్తించాలి
- పరీక్షల ప్రశాంతతపై సలహాలు సూచనలు
- పరీక్షా కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం పట్టణంలో సోమవారం జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల కేంద్రాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ హై స్కూల్, సెయింట్ మేరీస్ హై స్కూల్, బాబు క్యాంపు పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరుగుతున్నాయా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. త్రాగునీరు, విద్యుత్, సరైన కూర్చునే ఏర్పాట్లు, గదుల పరిశుభ్రత, ప్రశాంత వాతావరణం వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చోట్ల తక్షణమే మెరుగులు చేర్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయగల వాతావరణాన్ని కల్పించాలన్నారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎలాంటి అక్రమాలు మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో నియమించిన ఇన్విజిలేటర్లు సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల పారదర్శకతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163(బి) అమలు భద్రతా చర్యలు పోలీసు బందోబస్తు వంటి అంశాలపై కూడా కలెక్టర్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీలలో భాగంగా కలెక్టర్ విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కాలరీస్ హై స్కూల్ సహా అన్ని పరీక్షా కేంద్రాల్లో 100 శాతం హాజరు నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం మధ్యలో సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన



**బూర్గంపహాడ్ మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ప్రతిపాదిత సెల్ టవర్ నిర్మాణంపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు. గ్రామం మధ్య భాగంలో, ముఖ్యంగా అంగన్వాడి కేంద్రానికి ఆనుకుని టవర్ నిర్మాణం చేపట్టాలని యత్నించడం స్థానికుల్లో భయం, ఆగ్రహానికి కారణమైంది. సోమవారం గ్రామస్తులు భారీగా ఒకేచోట చేరి, సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. చిన్నపిల్లలు ఎక్కువగా ఉండే అంగన్వాడి సెంటర్ సమీపంలో టవర్ ఏర్పాటు చేస్తే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యం, గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.గ్రామస్థలు మాట్లాడుతూ, ముందస్తు సమాచారం లేకుండా గ్రామం మధ్యలో టవర్ నిర్మాణానికి ఏర్పాట్లు చేయడం అన్యాయమని అన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని, అవసరమైతే గ్రామం బయట ప్రాంతంలో టవర్ నిర్మించుకోవచ్చని సూచించారు.ముఖ్యంగా మహిళలు, తల్లులు ఈ నిరసనలో చురుకుగా పాల్గొన్నారు. అంగన్వాడి వద్ద పిల్లలు రోజూ ఉండే పరిస్థితిలో టవర్ వల్ల వచ్చే రేడియేషన్ ప్రభావంపై భయాందోళనలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

**సెల్ టవర్ వల్ల ఆరోగ్య సమస్యల భయం**

గ్రామస్తులు తమ ఆందోళనలో భాగంగా టవర్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనులను అడ్డుకున్నారు. గ్రామం మధ్యలో టవర్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో వివిధ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని భయపడుతున్నారు.

## గ్రామ అభివృద్ధికి రోడ్డు నిర్మాణాలు ముఖ్యం

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ**



**మహా దుమ్ముగూడెం:** గ్రామాభివృద్ధికి రోడ్డు నిర్మాణాలు ముఖ్యమని భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ అన్నారు. సోమవారం డబ్ల్యూ ఎల్ రేగుబల్లి పంచాయతీ పరిధిలోని ఎంపీ నిధులతో మంజూరైన సిసి రోడ్ల నిర్మాణ పను లను సర్పంచ్ విజయ కుమారితో కలిసి 1ప్రారంభించారు. ఎంపీ నిధుల ద్వారా సుమారు రూ.20 లక్షల వ్యయంతో గ్రామంలోని 4 ప్రాంతాల్లో సిసి రోడ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధిలో ముందుందని, గ్రామాల మౌలిక వస్తువుల కల్పనకు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సత్యాలు, కొత్త దంతనం సర్పంచ్ సుబ్బారావు, ఉప సర్పంచ్ ఖాదర్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ శేఖర్ సాంబశివరావు నరేంద్ర సాగర్ రామకృష్ణ రవికుమార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తించాలి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కంపెనీలో వివిధ విభాగాల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఏరియా సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. కొత్తగూడెం ట్రైనింగ్ సెంటర్లో వారం రోజులపాటు సెక్యూరిటీ సిబ్బందికి జరిగే శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని పేర్కొన్నారు. శిక్షణనివ్వడం తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడుతుందన్నారు. వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరుగుతుందని అందుకోసం మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళేలోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించాలని మెరుగైన వృత్తి నైపుణ్యంతో క్రమశిక్షణతో నీతినిజాయితీతో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణ రెడ్డి ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించాలి




- ఖర్చులను సైతం తగ్గిస్తూ దిగుబడులను పెంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్
- రైతులను ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన
- టీకాల కార్యక్రమంపై అవగాహన గోడపత్రికలను ఆవిష్కరించిన కలెక్టర్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటల దిగుబడులను గణనీయంగా పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. సోమవారం రామవరం కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంట వ్యాధి నివారణకు సంబంధించి నిర్వహిస్తున్న జాతీయ ఉచిత టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించే గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం జెండా ఊపి టీకాల కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. కిసాన్ మేళా సందర్భంగా వ్యవసాయం కృషి విజ్ఞాన కేంద్రం పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన వివిధ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి సమగ్రంగా పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల నిర్వహణ విధానాలు, వ్యవసాయ యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలు, నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు అకాల వర్షాలు వడగళ్ల వానలు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ ఆధునిక పద్ధతులను అనుసరించడం అత్యవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులను రైతులు స్వీకరించి ఆధునిక విధానాల ద్వారా ఖర్చులను తగ్గిస్తూ దిగుబడులను పెంచుకోవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు శాస్త్రవేత్తల సలహాలు ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట మార్పిడి విధానాలను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సంప్రదాయ వ్యవసాయంతో పాటు వాణిజ్య పంటల సాగు మిశ్రమ పంటల విధానం పశుసంవర్ధక రంగాన్ని అనుసంధానం చేసుకోవడం ద్వారా రైతుల ఆదాయం పెంపొందించుకోవచ్చని వివరించారు.ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కిసాన్ మేళా నిర్వహించబడిందని రైతులకు ఒకే వేదికపై ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మేళా ద్వారా రైతులు కొత్త పద్ధతులను నేర్చుకుని వాటిని తమ పొలాల్లో అమలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, త్రీ ఇంక్లైన్ సర్పంచ్ ఈసం ప్రవల్లిక, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ భరత్, ఆత్మ చైర్మన్లు వీరభద్ర రావు, బుచ్చిబాబు, బోడా మంగీలాల్, శాస్త్రవేత్తలు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్
24-03-2026
మహా స్పెషల్
04





# రంగారెడ్డి.. రారాజు

## తెలంగాణ ఆర్థిక ముఖచిత్రంలో రంగారెడ్డి ఘనత

## దేశంలోనే నెంబర్ వన్ జిల్లాగా రంగారెడ్డి


## లెక్కతేల్చిన సోషియో ఎకనామిక్ రిపోర్ట్ 2025-26

(మహా ప్రత్యేకం)

సంపద సృష్టిలో రంగారెడ్డి జిల్లా మరోసారి రారాజు లా నిలిచింది. అనుకున్న హైదరాబాద్ మహానగరానికి ఒకప్పటి తన శివారు ప్రాంతం, నేటి మహా ఆర్థిక శక్తి రంగారెడ్డి జిల్లా . తాజాగా విడుదలైన 'తెలంగాణ సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్ 202526' నివేదిక రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రంపై స్పష్టతనిచ్చింది. అభివృద్ధి అంతా నగర కేంద్రం దాటి ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి పరుగులు పెడుతోందనడానికి, ఒకప్పటి పల్లె ప్రాంతాలు నేడు డాలర్ల పంట పండిస్తున్నాయనడానికి ఈ నివేదికే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. జాతీయ సగటును మించి తెలంగాణ సాధిస్తున్న అద్భుతమైన ఆర్థిక ప్రగతికి ఈ లెక్కలే ప్రతీక. దేశంలోనే రంగారెడ్డి జిల్లా అత్యంత ఆర్థికసామర్థ్యం కలిగిన జిల్లాగా ఇదివరకే రికార్డు నెలకొల్పింది.

### రంగారెడ్డికి.. పారిశ్రామిక బలం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఏటేటా సరికొత్త పుంతలు తొక్కుతోంది. గతేడాది రూ. 3.40 లక్షలుగా ఉన్న రాష్ట్ర సగటు తలసరి ఆదాయం, కేవలం ఏడాది కాలంలోనే పది శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసి ఏకంగా రూ. 4,18,931 కు చేరడం ఆర్థికవేత్తలనే విస్మయానికి గురిచేస్తోంది. జాతీయ సగటు ఆదాయం కేవలం రూ. 2,19,575 వద్దే ఆగిపోగా, దానికి దాదాపు రెట్టింపు స్థాయిలో తెలంగాణ ఆదాయం ఉండటం గమనార్హం. ఇదే సమయంలో రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ) జాతీయ సగటు 8.0 శాతాన్ని మించిపోయి, 10.7 శాతం అద్భుతమైన వృద్ధితో 17.82 లక్షల కోట్లకు చేరుకోవడం ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో వస్తున్న పెను మార్పునకు నిదర్శనం. ప్రతి వ్యక్తి సగటున ఏడాదికి ఎంత సంపాదిస్తున్నాడనే తలసరి ఆదాయం లెక్కల్లో రంగారెడ్డి జిల్లా సృష్టించిన రికార్డులు అన్నీ ఇన్నీ కావు. ఒక సగటు రంగారెడ్డి జిల్లా వాసి ఏడాదికి ఏకంగా రూ. 11,29,735 కు పైగా ఆదాయాన్ని ఆర్జిస్తూ



దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అవతరించాడు. సరిగ్గా ఇదే సమయంలో హైదరాబాద్ వాసి ఆదాయం రూ. 4,76,679 కే పరిమితమై రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి రాగా, రూ. 3,94,587 తో సంగారెడ్డి మూడో స్థానంలో నిలిచింది. నగర కేంద్రంలో స్థలాల కొరత, ట్రాఫిక్ రద్దీ కారణంగా ఐటీ కంపెనీలు, బహుళ జాతి సంస్థలు తమ కార్యకలాపాలను పూర్తిగా పశ్చిమ కారిడార్ వైపు మళ్లించడమే దీనికి ప్రధాన కారణం. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ వంటి ప్రపంచస్థాయి ఐటీ, రియల్ ఎస్టేట్ కేంద్రాలు పూర్తిగా రంగారెడ్డి భౌగోళిక పరిధిలోకి రావడమే ఆ జిల్లాను సిరుల గనిగా మార్చింది. ఒక జిల్లా మొత్తం ఉత్పత్తి చేసే ఆర్థిక విలువను సూచించే "స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి" (జి.డి.డి.పి) లోనూ రంగారెడ్డి సింహగర్జన చేసింది. ఏకంగా రూ. 3.41 లక్షల కోట్ల పైచిలుకు ఆర్థిక పరిమాణంతో అగ్ర పీఠాన్ని అధిరోహించగా, రూ. 2.25 లక్షల కోట్లతో హైదరాబాద్ ద్వితీయ స్థానానికే పరిమితమైంది. రూ. 1.16 లక్షల కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి మూడో స్థానంలో నిలిచింది.

### అసమతుల్యత

ఈ నాణేనికి మరోవైపు చూస్తే కన్నీరు పెట్టించే వాస్తవాలు కూడా కనిపిస్తున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి అంతా హైదరాబాద్ చుట్టుపక్కలే కేంద్రీకృతం కావడం వల్ల ఉత్తర తెలంగాణ జిల్లాలు తీవ్రంగా వెనుకబడ్డాయి. వ్యవసాయ రంగం రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉపాధి కల్పిస్తున్నప్పటికీ, రాష్ట్ర ఆదాయానికి అది కేవలం 14 శాతం మాత్రమే దోహదపడుతోంది. కానీ రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన ఐటీ సేవలు ఏకంగా 23 శాతానికి పైగా ఆదాయాన్ని తెచ్చిపెడుతూ మెట్రోపాలిటన్ జిల్లాలను అగ్రస్థానంలో నిలబెట్టాయి. వ్యవసాయంపైనే ప్రధానంగా ఆధారపడిన హనుమకొండ (రూ. 2,37,809), జగిత్యాల (రూ. 2,44,245), వికారాబాద్ (రూ. 2,47,747), మరియు రాజన్న సిరిసిల్ల (రూ. 2,55,984) జిల్లాలు ఆదాయ పట్టికలో అట్టడుగున ఉండటం రాష్ట్రంలో పెరిగిపోతున్న ప్రాంతీయ, ఆర్థిక అసమానతలను కళ్ళకు కడుతోంది. ఏకంగా పదకొండు లక్షల ఆదాయం ఉన్న రంగారెడ్డి ఎక్కడ, కేవలం రెండు లక్షల ముప్పై ఏడు వేల వద్దే ఆగిపోయిన హనుమకొండ ఎక్కడ? పారిశ్రామికీకరణ లేకపోవడం, అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటం వల్ల ఈ జిల్లాలు వెనుకబడిపోయాయి

### స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి

33 జిల్లాల ఆర్థిక పరిమాణం (కోట్ల రూపాయల్లో)...

| జిల్లా | ఉత్పత్తి |
|---|---|
| రంగారెడ్డి - | రూ. 3,41,080 కోట్లు |
| హైదరాబాద్ - | రూ. 2,25,860 కోట్లు |
| మేడ్చల్ మల్కాజిగిరి - | రూ. 1,16,133 కోట్లు |
| సంగారెడ్డి - | రూ. 74,194 కోట్లు |
| నల్గొండ - | రూ. 64,219 కోట్లు |
| నిజామాబాద్ - | రూ. 49,974 కోట్లు |
| భద్రాద్రి కొత్తగూడెం - | రూ. 48,354 కోట్లు |
| ఖమ్మం - | రూ. 47,184 కోట్లు |
| సూర్యాపేట - | రూ. 38,865 కోట్లు |
| సిద్దిపేట - | రూ. 37,495 కోట్లు |
| మహబూబ్ నగర్ - | రూ. 22,787 కోట్లు |
| కరీంనగర్ | రూ. 21,362 కోట్లు |
| మెదక్ | రూ. 19,184 కోట్లు |
| యాదాద్రి భువనగిరి | రూ. 18,651 కోట్లు |
| కామారెడ్డి | రూ. 16,928 కోట్లు |
| జగిత్యాల | రూ. 16,835 కోట్లు |
| హనుమకొండ | రూ. 16,587 కోట్లు |
| పెద్దపల్లి | రూ. 16,327 కోట్లు |
| నాగర్ కర్నూల్ | రూ. 15,897 కోట్లు |
| మంచిర్యాల | రూ. 15,484 కోట్లు |
| వికారాబాద్ | రూ. 14,344 కోట్లు |
| వరంగల్ | రూ. 14,276 కోట్లు |
| మహబూబాబాద్ | రూ. 13,367 కోట్లు |
| ఆదిలాబాద్ | రూ. 12,689 కోట్లు |
| నిర్మల్ | రూ. 12,575 కోట్లు |
| జయశంకర్ భూపాలపల్లి | రూ. 10,861 కోట్లు |
| జనగాం | రూ. 10,651 కోట్లు |
| జోగులాంబ గద్వాల్ | రూ. 10,402 కోట్లు |
| వనపర్తి | రూ. 10,128 కోట్లు |
| రాజన్న సిరిసిల్ల | రూ. 9,844 కోట్లు |
| నారాయణపేట | రూ. 9,225 కోట్లు |
| కుమురం భీమ్ ఆసిఫాబాద్ | రూ. 7,935 కోట్లు |
| ములుగు | రూ. 5,626 కోట్లు |

### సగటు తలసరి ఆదాయం

33 జిల్లాల పూర్తి వివరాలు (రూపాయల్లో)

| జిల్లా | ఆదాయం |
|---|---|
| రంగారెడ్డి | రూ. 11,29,735 |
| హైదరాబాద్ | రూ. 4,76,679 |
| సంగారెడ్డి | రూ. 3,94,587 |
| మేడ్చల్ మల్కాజిగిరి | రూ. 3,81,506 |
| భద్రాద్రి కొత్తగూడెం | రూ. 3,69,420 |
| మహబూబ్‌నగర్ | రూ. 3,36,898 |
| ములుగు | రూ. 3,35,509 |
| యాదాద్రి భువనగిరి | రూ. 3,35,264 |
| నల్గొండ | రూ. 3,30,216 |
| మెదక్ | రూ. 3,29,209 |
| పెద్దపల్లి | రూ. 3,27,477 |
| ఖమ్మం | రూ. 3,25,120 |
| సూర్యాపేట | రూ. 3,22,540 |
| సిద్దిపేట | రూ. 3,18,650 |
| నిజామాబాద్ | రూ. 3,15,420 |
| జనగాం | రూ. 3,10,280 |
| వనపర్తి | రూ. 3,08,540 |
| రాజన్న సిరిసిల్ల | రూ. 3,05,670 |
| జయశంకర్ భూపాలపల్లి | రూ. 3,02,150 |
| కామారెడ్డి | రూ. 2,98,430 |
| కరీంనగర్ | రూ. 2,95,670 |
| మంచిర్యాల | రూ. 2,90,340 |
| నాగర్ కర్నూల్ | రూ. 2,85,120 |
| వరంగల్ | రూ. 2,80,560 |
| కుమురం భీమ్ ఆసిఫాబాద్ | రూ. 2,75,430 |
| నిర్మల్ | రూ. 2,70,120 |
| జోగులాంబ గద్వాల్ | రూ. 2,65,340 |
| నారాయణపేట | రూ. 2,60,150 |
| మహబూబాబాద్ | రూ. 2,56,485 |
| ఆదిలాబాద్ | రూ. 2,52,130 |
| వికారాబాద్ | రూ. 2,47,747 |
| జగిత్యాల | రూ. 2,44,245 |
| హనుమకొండ | రూ. 2,37,809 |

### క్యూర్-ప్యూర్-రేర్" మోడల్ తో భారీ ప్రణాళికలు

అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్రాన్ని మూడు ఎకనామిక్ జోన్లుగా విభజిస్తూ ప్రభుత్వం సరికొత్త క్యూర్ ప్యూర్ రేర్ మోడల్ ను తెరపైకి తెచ్చింది. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతాన్ని 'క్యూర్' గా మార్చి కేవలం ఐటీ, ఏఐ, కాలుష్య రహిత సర్వీస్ రంగాలకు పరిమితం చేయనున్నారు. ఓఆర్ఆర్ నుండి రీజినల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న ప్రాంతాన్ని 'ప్యూర్' గా నామకరణం చేసి భారీ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తారు. ఇక ఆర్ ఆర్ ఆర్ అవతల ఉన్న గ్రామీణ ప్రాంతమంతా 'రేర్' పేరిట గ్రీన్ ఎకానమీ, అగ్రిప్రాసెసింగ్ పై దృష్టి పెడుతుంది. దీనికి తోడు దక్షిణ హైదరాబాద్‌లో ముప్పై వేల ఎకరాల్లో ఏకంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ' ని నిర్మించబోతున్నారు. ఇందులో మూడు వందల ఎకరాల్లో ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాబోతోంది. దేశంలోనే ఉన్న మొత్తం జెన్ ఏ ఐ స్టార్టప్స్‌లో 7 శాతం ఒక్క తెలంగాణలోనే ఉండటం గమనార్హం. ఎగుమతుల్లో ఇప్పటికే దేశంలో ఏడవ స్థానంలో ఉన్న తెలంగాణ, కార్గో రవాణాను మరింత సులభతరం చేయడానికి ఖమ్మం, వరంగల్, నల్గొండ, నిజామాబాద్ లలో 'మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులను' నిర్మించనుంది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్2 ని 162.5 కి.మీ మేర సుమారు రూ. 43,848 కోట్లతో విస్తరించనున్నారు.

### మహిళా సాధికారత, వైద్యం, వనరుల్లో తిరుగులేని సత్తా

ఉపాధి రంగంలో తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా మహిళా ఉపాధి భాగస్వామ్యం కేవలం 34.9 శాతం మాత్రమే ఉంటే, తెలంగాణలో అది ఏకంగా 45.4 శాతంగా నమోదై సంచలనం సృష్టించింది. మహిళా స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావడమే దీనికి ప్రధాన కారణం. వైద్యరంగంలోనూ రాష్ట్రం అద్భుతమైన ఆరోగ్య ప్రమాణాలను నెలకొల్పింది. మాతృ మరణాల రేటు జాతీయ సగటు 88 కాగా, తెలంగాణ దాన్ని 43 కు తగ్గించింది. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ విధానం ద్వారా మొత్తం మెడికల్ సీట్లను 4,140 కి పెంచారు. వనరుల పరంగా చూస్తే, బొగ్గు ఉత్పత్తితో పాటు 21 సిమెంట్ ప్లాంట్ల ద్వారా పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతుండగా, 74.51 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తూ ఏకంగా 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి సాధించింది. విద్యుత్ రంగంలో పర్యావరణ హిత (రెన్యూవబుల్) ఇంధన వనరుల వాటా 44.55 శాతానికి పెరగడం మరో విశేషం. ఒకవైపు ఐటీ, ఫార్మా లాంటి ఆధునిక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తూనే, మరోవైపు పట్టణాలకు పరిమితమైన ఆదాయాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా ప్రభుత్వ ప్రణాళికలు అమలు చేస్తే, "విజన్ 2047" లక్ష్యంగా తెలంగాణ ఖచ్చితంగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అవతరించడం ఖాయంగా కనిపిస్తోంది.

# అగ్ని ప్రమాద కుటుంబాలకు అండగా ఉంటాం

**మాజీ ఎమ్మెల్యే, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య**



**మహా దుమ్ముగూడెం:** మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన నిరుపేద కుటుంబాలను భద్రాచలం మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ పొదేం వీరయ్య బాధిత కుటుంబాలను పరామర్శించారు. సోమవారం గ్రామంలో పర్యటించిన ఆయన ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించి నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు అనంతరం బాధితులకు 10000 రూపాయల నగదు సాయం అందించి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని వారికి హామీ ఇచ్చి కుటుంబానికి ధైర్యం తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం గ్రామంలోని సీనియర్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ మచ్చ వెంకటరమణ మామ గారి పెండ్యాల సత్యనారాయణ దశదినకర్మలకు హాజరై కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినిల్ తెల్లం హరికృష్ణ స్థానిక సర్పంచ్ తుర్రం నవీన్ సందీప్ రెడ్డి రమేష్ వాసిరెడ్డి సాంబశివ రావు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్ణశాలలో వేలం పాటలు ఖరారు

- వాహనాల పార్కింగ్ ఆసీలు వసూలు 71.20 లక్షలు
- గోదావరి బోటు షికార్ 42.50 లక్షలు ఖరారు



**మహా దుమ్ముగూడెం:** పర్ణశాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వాహనాల పార్కింగ్ ఆసీలు, గోదావరి బోటు షికారు ,మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించిన వేలంపాట ప్రక్రియలను గ్రామపంచాయతీ సర్పంచ్ వాగే ఖాదర్ బాబు అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు.నిర్వహణను ఏడాది పాటు దక్కించుకోవడం కోసం పలువురు గుత్తేదారులు పాటలో పాల్గొనగా వాహనాల పార్కింగ్ వసూలు పాటను 71.20 లక్షల రూపాయలకు పెద్ద బండిరేవ్ గ్రామానికి చెందిన సోయం కనకారావు హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గోదావరిలో బోటు విహార యాత్ర కోసం నిర్వహించే పాటను 42.50 లక్షలు రూపాయలకు బండిరేవు గ్రామానికి చెందిన సోయం రమేష్ దక్కించుకున్నారు. అనంతరం పర్ణశాల పంచాయతీలు మరుగుదొడ్ల నిర్వహణకు నిర్వహించిన పాటలు సకినం సంతోష్ లక్ష 25 వేల రూపాయలకు పాడి దక్కించుకున్నారు. ఈ పాటల ద్వారా పర్ణశాల గ్రామపంచాయతీకి అభివృద్ధికి భారీగా ఆదాయం లభించింది. ఈ వేలం పాట ప్రక్రియలో మండల ఎంపీడీవో వివేక్ రామ్, మండల పంచాయతీ అధికారి వీరారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ ఉప సర్పంచ్ వాగే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి

# వేగవంతమైన చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతి పత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యలను నిజాయితీగా, సమర్థవంతమైన పరిపాలన అందించడమే లక్ష్యంగా అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న సింగరేణి జి.ఎం శ్రీనివాస్

జి.ఎం దంపతులను సన్మానించిన 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి హనుమంతరావు



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో కొలువై ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ లక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి, ఆలయ కమిటీ సభ్యులు జి.ఎం దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దివేది పెద్దిరాజు, దివేట్ శ్రీను, రమేష్, గంధం బాబి, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, వాసు, జి.కాశీ విశ్వనాథ్, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు




- ధైర్యానికి ప్రతీక దేశ భక్తికి ప్రతిరూపం
- భగత్ సింగ్ జయంతిని ప్రభుత్వం అధికారం గా నిర్వహించాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు గుగులోతు వంశీ

**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భగత్ సింగ్ 95 వ వర్ధంతి వేడుకలను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు గుగులోతు వంశి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంగ్లేయుల చెర నుండి భరతమాత విముక్తి కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి ప్రతిరూపాలుగా నిలిచిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల చిత్రపటాలకు పూలమాల లేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం కోసం వారు చేసిన ఉద్యమ పంథాలను, త్యాగాలను కొనియాడారు. భగత్ సింగ్ మరణం తర్వాత దేశంలో విప్లవ ఉద్యమాలు మరింత బలపడ్డాయని, భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో విప్లవ భావజాలం కలిగిన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ ఏర్పాటుకు దోహదపడ్డాయని, ఆయన అన్నారు. సార్వభౌమ అధికారం, లౌకికవాదం, సోషలిజం, సెక్యులరిజం, కమ్యూనిజం కోసం పోరాడుతున్న ఎందరికో గొప్ప స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్ అన్నారు. నేటి యువత, విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకొని, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరసయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు బాలాజీ, నవీన్, అనిల్ కుమార్, ప్రవీణ్, అఖిల్, తోపాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈనెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, 28న నిర్వహించనున్న మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అత్యంత ఘనంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి ఏర్పాట్లపై సోమవారం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ శ్రీరామనవమి మహా పట్టాభిషేకం ఆలయ అభివృద్ధి పనుల భూమి పూజ కార్యక్రమాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే కార్యక్రమాల సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికతో పని చేస్తున్నాయని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా భద్రత ట్రాఫిక్ పారిశుద్ధ్యం తాగునీరు వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. మిథిలా స్టేడియం ఆలయ పరిసర ప్రాంతాల్లో జనసమ్మర్థాన్ని దృష్టిలో ఉంచుకుని బారికేడింగ్ క్యూలైన్లు ప్రత్యేక ప్రవేశనిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు శాఖతో సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపడుతున్నామని వివరించారు. వివిఐపీలు, వీఐపీలకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చేందుకు ప్రత్యేక బృందాలను నియమిస్తున్నామని తెలిపారు.సంబంధిత శాఖలన్నీ తమ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి కార్యక్రమాలన్నింటినీ సమయానికి పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేసి, శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, సిపిఓ సంజీవరావు, దేవస్థాన ఈఈ రవీందర్, తాసిల్దార్ వెంకటరమణ, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇటుక బట్టీల దందా ఇష్టారాజ్యం..!

- ఇతర రాష్ట్రాల కార్మికుల చేత వెట్టి చాకిరి
- అరకొర కూలి.. వ్యాపారస్తుడికి ఖుషి
- అనుమతులు ఉండవు కానీ దర్జాగా వ్యాపారం
- అధికారులు సక్రమంగా పట్టించుకోకపోవడంపై విమర్శలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు అక్రమంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకొని దర్జాగా దోచుకుంటున్నారనే ఆరోపణలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటుక బట్టీలు పెట్టిన వారంతా ప్రభుత్వం నుండి సక్రమంగా అనుమతులు తీసుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది. ఏ ఒక్క ఇటుక బట్టికి ఊరు పేరు ఉండదు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తీసుకొచ్చి భద్రాద్రి జిల్లా కేంద్రంలో ఇటుక బట్టీలలో పనులు చేయిస్తున్నారని వారికి అరకొర కూలి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని కొందరు సామాజిక కార్యకర్తలు అసహన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవపల్లి మండల పరిధిలోని జూబ్లీపురం సమీపంలో జోరుగా ఇటుక బట్టీల వ్యాపారం జరుగుతుంది. ఇక్కడ వ్యాపారానికి అన్ని శాఖల నుండి అనుమతులు ఉన్నాయా లేవా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణ అధికారులు స్పందించి ఇటుక బట్టీల వ్యాపారంపై పరిశీలన చేయాలన్నారు. కార్మికులకు సక్రమంగా సదుపాయాలు అందుతున్నాయా..? వారికి వేతనాలు సక్రమంగా ఇస్తున్నారా..? అనేది కూడా పరిశీలించి అనుమతిలేని ఇటుక బట్టీలను సీజ్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు.

**నిబంధనలు గాలికి..**

వ్యవసాయ భూములతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో వ్యవసాయేతర పనులకు వినియోగిస్తున్నందుకు నాలా సుంకాన్ని రెవెన్యూకి చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవానికి వీటిని ఏర్పాటు చేయాలంటే కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి, భూగర్భ గనులు, రెవెన్యూ, భూగర్భ జల వనరుల శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి. అయితే ఎలాంటి అనుమతులు లేకుండానే మండలంలోని పలు గ్రామాల్లో సుమారు పదుల సంఖ్యలో బట్టీలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తూ ప్రభుత్వ స్థలాలు, అటవీ ప్రాంతం, చెరువుల నుంచి ఇటుకకు కావాల్సిన మట్టిని నిర్వాహకులు అక్రమంగా తరలిస్తున్నట్టు తెలిసింది.

# అక్రమ ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి

**మణుగూరు ఎఫ్‌డీఓకు తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల వినతి..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలో అటవీ కలపను అక్రమంగా వినియోగిస్తూ నిర్వహిస్తున్న సుమారు 70 ఇటుక బట్టీలను అటవీ చట్టాల ఉల్లంఘన కింద వెంటనే సీజ్ చేయాలని తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం మణుగూరు ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆల్లెం కోటి, ఆదివాసీ ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ మాట్లాడుతూ అశ్వాపురం మండలంలోని సీతారాంపురం, గొందిగూడెం, తుమ్మలచెరువు, జగ్గారం తదితర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అటవీ కలపను అక్రమంగా వినియోగిస్తూ కోట్లాది రూపాయల అటవీ సంపదను తరలిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా అటవీ హద్దుల పరిధిలో కూడా ఇటుక బట్టీలు నడుస్తున్నాయని తెలిపారు. అక్రమంగా అటవీ కలప రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఇటుక బట్టీలన్నింటినీ సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎఫ్‌డీఓను కోరారు. దీనిపై స్పందించిన ఎఫ్‌డీఓ అక్రమ కలప రవాణాను అరికట్టి, అటవీ హద్దుల్లో ఉన్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి మధు, గుమ్మడి రామ్‌కుమార్, పాయం సూరయ్య తదితరులు పాల్గొన్నారు

# దేశ స్వతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప వీరుడు



- ఇబ్రహీంపట్నం ఏఎంసి డైరెక్టర్ సాతిరి ఎల్లేష్
- ఆరుట్లలో ఘనంగా షహీద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భయం అనే ఆలోచనలు మెదడులోకి రానీయకు, ఆ ఆలోచనలే నిన్ను పిరికి వాడిని చేస్తాయి భగత్ సింగ్ తెలిపిన మాటలను నేటి సమాజానికి గుర్తు చేస్తూ దేశ స్వతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప వీరుడని, ఇబ్రహీంపట్నం ఏఎంసి డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ గుర్తు చేశారు. ఆదివారం మంచాల మండలం ఆరుట్ల గ్రామం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన, షాహిద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి కార్యక్రమంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాట్లాడుతూ... భయం అనే ఆలోచనలు మెదడులోకి రానీయకు, ఆ ఆలోచనలే నిన్ను పిరికి వాడిని చేస్తాయి భగత్ సింగ్ తెలిపిన మాటలను నేటి సమాజానికి గుర్తు చేసిన, ఇబ్రహీంపట్నం ఏఎంసి డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ గుర్తు చేశారు. దేశ స్వాతంత్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, ఒక లక్ష్యం కోసం పోరాడిన జీవితానికి, అలాంటి ముగింపు గర్వకారణమే కానీ దయనియం కాదు, తన మరణం ముందు తరాలకు త్యాగమనే సుగుణంలో సాగుతుందని, మానవాళికి సేవ చేయడానికి, పీడితలకు విముక్తి కలిగించడానికి యువతరం ముందుకు వచ్చినప్పుడే నవయుగానికి నాంది ప్రస్తావన జరుగుతుందని సాతిరి ఎల్లేష్ అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి సలాం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,యూత్ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు, యువకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీడి

- గ్రామ కార్యదర్శులు పనులను పరిశీలించాలని ఆదేశం



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాలను, సీఎస్పీ నిర్మాణాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏపీడి విజయ భాస్కర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. మాచినేనిపేట తండా ఎర్ర చెరువు పూడికతీత పనులు, పడమట నర్సాపురం గ్రామంలోని గుట్టపై జరుగుతున్న కాలువ తవ్వకాల పనులతో పాటు, మస్టర్లను పరిశీలించారు. పని ప్రదేశాల కల్పిస్తున్న వసతుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పనిలో పాల్గొనని ఉపాధి కూలీలతో మాట్లాడి పనికి హాజరయ్యే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పని ప్రదేశాన్ని, మస్టర్లను రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా గ్రామ కార్యదర్శులు పరిశీలించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు అందాల్సిన చెల్లింపులు ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే కూలీల ఖాతాలలో జమ అవుతాయని తెలిపారు. నర్సాపురం, అనంతారం, గ్రామాలలో సీఎస్పీ నిర్మాణాలను, జూలూరుపాడు నర్సరీలో మొక్కల పెరుగుదలను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్ళూరి రవి, ఏపీఓ రామారావు, నర్సాపురం సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి, ఈసీ సైదులు, పంచాయతీ కార్యదర్శులు ఖాదర్ వలీ, బి హారిక, టెక్నికల్ అసిస్టెంట్ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతతో పేదలకు కష్టాలు

- గ్యాస్ లేక కట్టెల కోసం తిరగాల్సిన పరిస్థితి దాపురించింది
- రైతుబంధు సమయానికి రాక ప్రస్తుతం వచ్చేవి వడ్డీకే సరిపోతున్నాయి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



**పినపాక ,మహా:** గ్యాస్ సరఫరా సమయానికి అందక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల సామాన్యులపై ఆర్థిక భారం మరింత పెరిగిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తీవ్రంగా విమర్శించారు. సోమవారం సాయంత్రం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు .ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ, ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధరలు సాధారణ ప్రజలకు అందని ద్రవ్యంగా మారాయని అన్నారు. ఒకప్పుడు పేదలు కూడా సులభంగా వాడగలిగిన గ్యాస్ ఇప్పుడు భారంగా మారిందని పేర్కొన్నారు. గ్యాస్ బుకింగ్ చేసినప్పటికీ సమయానికి సరఫరా కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మరింత ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టెల కోసం తిరగాల్సిన పరిస్థితి మళ్లీ వచ్చిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటిని అడ్డుకునేలా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా సబ్సిడీలు పెంచాలని, గ్యాస్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై కూడా కనకయ్య తీవ్రంగా స్పందించారు. వరి పంటకు బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చాలా మంది రైతుల ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమ చేయలేదని ఆరోపించారు. రైతుల పక్షపాతిగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.పంట చేతికి వచ్చినప్పటికీ కొనుగోలు కేంద్రాలను సమయానికి ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. మధ్యవర్తుల చేతిలో రైతులు దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణమని అన్నారు.రైతుబంధు పథకం అమలు విషయంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. పంట వేసే సమయంలో అందాల్సిన రైతుబంధు సాయం పంట కోత సమయంలో ఇవ్వడం వల్ల రైతులు అప్పుల పాలవుతున్నారని చెప్పారు. ఇచ్చిన సాయం కూడా వడ్డీలకు సరిపోని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు.ఇంకా రైతుబంధు ఎన్ని ఎకరాలకు ఇస్తారనే విషయంపై కూడా ప్రభుత్వానికి స్పష్టత లేదని కనకయ్య విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితమైపోయాయని అన్నారు.ప్రభుత్వం వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు..



**మణుగూరు, మహా :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 95వ వర్ధంతిని సందర్భంగా మణుగూరు సంతోష్‌నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్‌టీయూ ఏరియా అధ్యక్షుడు ఆంగోత్ మంగీలాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ థాపర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి ఆంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఉరిశిక్షను సాహసంగా స్వీకరించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగం చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్య సమరంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచిన వీరి ఆశయాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం పోరాడిన భగత్‌సింగ్ త్యాగం భారత యువతకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏనిక పవన్‌కుమార్, పాఠశాల అధ్యాపకులు సువాసినీ దేవి, కుమారి, సుజాత, రాధా తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకానికి కేంద్రం తూట్లు.!




- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- యూపీఏ ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు కొట్లాడి తెచ్చుకున్న ఉపాధి హామీ పథకం
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి
- ఇబ్రహీంపట్నం నుండి రంగారెడ్డి కలెక్టరేట్ వరకు పాదయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వామపక్ష పార్టీలు కొట్లాడి తెచ్చుకున్న ఉపాధి హామీ పథకాన్ని తొలగించాలని, బిజెపి ప్రభుత్వం చూస్తుందని జాన్ వెస్లీ అన్నారు. సోమవారం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రం నుండి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రను, సీపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి యాదయ్యతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగిన పాదయాత్ర. ఈ సందర్భంగా సీపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలని, గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో, రంగారెడ్డి జిల్లాలో ఉన్న రామోజీ ఫిల్మ్ సిటీలో పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలు వారికి కేటాయించాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలు, పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు, పించన్ల వంటి సమస్యల పరిష్కారానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని యాచారం, మంచాల మండలాలలో పేదలకు ఇచ్చిన భూములను, ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కునే ప్రయత్నాలు చేస్తుందని, జాన్ వెస్లీ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మహేశ్వరం మండలం, రావిరాల గ్రామంలో ఎన్నో ఏండ్లుగా సాగుచేస్తున్న రైతుల భూములకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. గత యూపీఏ ప్రభుత్వం హయాంలో వామపక్ష పార్టీలు కొట్లాడి తెచ్చుకున్న ఉపాధి హామీ పథకాన్ని తొలగించాలని, బిజెపి ప్రభుత్వం చూస్తుందని ఆయన మండిపడ్డారు. ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాన్ వెస్లీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర, జిల్లా, మండలాల కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## దండుమైలారంలో మెగా ఉచిత వైద్య శిబిరం

- సద్వినియోగం చేసుకోవాలన్న సర్పంచ్ నరేష్ గౌడ్
- గ్రామంలో 99వ రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దండుమైలారం గ్రామంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నరేష్ గౌడ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండలం దండుమైలారం గ్రామంలో 99వ రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును, గ్రామ సర్పంచ్ నరేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ... పేద ప్రజలకు కార్పోరేట్ హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందచేయాలని సూచించారు. వేసవిలో ప్రభుత్వ వైద్యులు చేసిన సూచనలు, సలహాలు పాటించి వ్యాధులు ప్రబల కుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పిహెచ్సి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ లక్ష్మి ప్రసన్న, డాక్టర్లు దివ్యా, వైప్రావలి, వీరాప్రసాద్, సుసి మాశ్రీ వైశాలి, సరయు, సంఘవి, రామయ్య, హేమాలాల్, నిర్మల, మని సురేష్, రఘు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల దోపిడితో భగ్గుమన్న దళిత సంఘాలు

- సామాజిక పొంతన లేదు సాంస్కృతిక పొత్తు లేదు...
- హోలియా దాసరిలో దాసరి అనే పదంతో నకిలీ ధ్రువపత్రం
- నకిలీ ఎస్సీ ధృవపత్రాలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల డిమాండ్
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన దళిత సంఘాలు...




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తలకొండపల్లి మండలం, జంగారెడ్డి పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నేతృత్వంలో గ్రామ పంచాయితి కార్యాలయం ముందు అక్రమ మార్గంలో ఎస్సీ కుల దృవీకరణ పత్రం ఇచ్చిన ఆర్డిఓ, జిల్లా కలెక్టర్ పక్షపాత వైఖరిపై, దళిత ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన, జంగారెడ్డిపల్లి ఎన్నికలలో పోటీకి తప్పుడు కుల ధ్రువ పత్రాలను సమర్పించారు..... తలకొండపల్లి మండలం, జంగారెడ్డిపల్లి గ్రామంలో బిసి ఎ దాసరి కులానికి చెందిన కొంతమంది అక్రమ మార్గంలో, ఎస్సీ కుల దృవీకరణ పత్రం పొందడం పై గ్రామస్తులు, దళిత సంఘాలు ఎమ్మార్పీఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా పోతుగంటి కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ మాట్లాడుతూ... గత సంవత్సరం 2025లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలల్లో, జంగారెడ్డి పల్లి గ్రామం ఎస్సీ రిజర్వేషన్ కావడంతో పసుల మల్లేష్, మరి కొంతమంది దాసరి బిసి ఏ కులానికి చెందిన వారు, అక్రమ మార్గంలో షెడ్యూల్ క్యాస్ట్ కు చెందిన హోలియా దాసరి ఎస్సీ కుల దృవీకరణ పత్రంతో ఎన్నికలలో పోటీ చేయడం జరిగిందని కృష్ణ మాదిగ తెలిపారు. సదరు వ్యక్తులు ఎస్సీ కులానికి చెందిన వాళ్ళు కాదని, బిసి కులానికి చెందిన వ్యక్తులు తప్పుడు దృవీకరణ పత్రాలతో ఎన్నికలలో పోటీ చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా, నిర్లక్ష్యం వహిస్తూ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ ఎస్సీ కుల ధృవ పత్రాలను పొందిన వారి, తాత ముత్తాతల నాటి కుల వృత్తుల ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందని కృష్ణ తెలిపారు.

**సామాజిక పొంతన లేదు సాంస్కృతిక పొత్తు లేదు...**

దళితులు గుడి గోపురాలకు దూరంగా ఉన్నా, దాసరి కులస్తులు అలాంటి అవమానాలు ఏ రోజు ఎదుర్కోలేదని, ఈ గ్రామంలో దళితులకు దాసరి కులస్తులకు ఎటువంటి సామాజిక పొంతన లేదని, ఎటువంటి సంస్కృతిక పొత్తు లేదని తెలియజేయడం జరిగింది. హోలియా దాసరిలో దాసరి అనే పదాన్ని అడ్డం పెట్టుకుని ఎస్సీ రిజర్వేషన్లను కొల్లగొట్టడం దళితులకు అన్యాయం చేసినట్లేనని ఎమ్మార్పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. అక్రమ మార్గంలో ప్రభుత్వాన్ని మోసగించి ధృవీకరణ పత్రాన్ని సృష్టించి, గ్రామంలో సాంఘిక వ్యత్యాసాలు, సామాజిక హోదాలు నిజాన్ని దాయలేవని అన్నారు. ఎస్సీ ధృవీకరణ పాత్రని జారీచేసిన అధికారుల పై తక్షణమే విచారణ జరపాలని, నిజనిర్ధారణ కమిటీ వేసి నిజానిజాలు తెలుసుకుని వారికి అందించిన తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని, ఆపై అధికారులను డిమాండు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎంఆర్పిఎస్ జిల్లా, మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు ఇతర సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు..

**పలువురు బిజెపి నాయకులు హౌస్ అరెస్ట్...**



అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు...

**రాజేంద్రనగర్ మహా ;** రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే క్రమంలో పోలీసులు తోకల శ్రీనివాస్ రెడ్డి తో సహా పలువురు బిజెపి నాయకులను సోమవారం హౌస్ అరెస్టు చేశారు. బిజెపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి అరాచక పాలన సాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇంటి నుంచి బిజెపి నాయకులతో కలిసి బయదేరుతున్న క్రమంలో పోలీసుకు బలవంతంగా గృహ నిర్బంధం, హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకొని పరిపాలన ఎలా సాగిస్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు. ఎన్నికల్లో సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో వాగ్దానాలను చేసి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చింది. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకొని పరిపాలన సాగిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు న్యాయం జరిగే దాకా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు ఉద్యమాలు ఉదృతం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తోకల శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజుభూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం బిజెపి నాయకులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించగా మార్గమధ్యంలోని పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్కు తరలించారు . అర్హులైన వారికి పెన్షన్ ఇవ్వాలి ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి పొన్నమోని మల్లేష్ యాదవ్, సవాద విజయ్ కుమార్, హరికిషన్ జి, సందీప్ ముదిరాజ్, బండారి బాలకృష్ణ, గోదా పాండు యాదవ్, సూ రెడ్డి వినయ్ రెడ్డి, పైల్వాన్ రాజ్ కుమార్, వల్లూరి శ్రీనివాస్, వంశి యాదవ్, బాత్కు శ్రీనివాస్ యాదవ్, సంతోష్ గౌడ్, గూడూరు ఆంజనేయులు, రావుల భాస్కర్, తలారి చిన్న, బబ్లూ, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బొల్ల రామకృష్ణ, ఏన్ను శంకర్ రెడ్డి, హరినాథ్, పోప్పట్ ,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి..

**డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య**




**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ ఉప కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో అత్తాపూర్ సర్కిల్ పరిధిలోజిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి సోమవారం సర్కిల్ లోని హైదర్ గూడ వార్డు, విజ్ఞాన్ జూనియర్ కళాశాల వద్ద ఉన్న (జి వి పి )చెత్త వల్నరబుల్ పాయింట్ ను తొలగించారు. ఈ కార్యక్రమంలో సనిటేషన్ వర్కర్స్ ఆర్ పి లు, ఎస్ ఎఫ్ ఏ, ఎస్ ఎస్, సి ఓ ల తో కలిసి ర్యాలీ నిర్వహించారు. తమ ఇంటిలో ఉన్న చెత్తను స్వైట్ ఆటోలో వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమం 28వ తేదీ వరకు జిహెచ్ఎంసి పరిధిలో కొనసాగుతుందన్నారు.

## వైభవంగా అభయాంజనేయ స్వామి నాలుగో వార్షికోత్సవం...



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం నర్కుడా గుడా గ్రామంలోని అమ్మపల్లి అభయాంజనేయ స్వామి నాలుగవ వార్షికోత్సవం బిజెపి నాయకులు బుక్క వేణుగోపాల్ కుటుంబ సమేతంగా సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, అభిషేకంతో ప్రారంభించి అన్నదాన వితరణ కార్యక్రమంతో ముగించారు. ఆయన మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి ఆశీర్వచనాలతో శంషాబాద్ మండల గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి పలువురు భక్తులు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విప్లవ నిప్పుకణం భగత్ సింగ్..

- దేశ స్వతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప వీరుడు
- తాను కలలు కన్న స్వాతంత్రానికి విరుద్ధంగా నేటి సమాజం
- ఆయన జయంతి వర్ధంతిని ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భగత్ సింగ్ జయంతి వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని బేకరీ అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, 95వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయస్సులో ఉరికంబాన్ని ముద్దాడి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వీరుడు భగత్సింగ్ అని కొనియాడారు. భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజగురులను బ్రిటిష్ ప్రభుత్వం దారుణంగా ఉరితీసిందని, వారు మరణించిన అనంతరం యువతరం పెద్ద ఎత్తున బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. దేశంలోని పేదల బడుగు బలహీనవర్గాల కోసం భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురులు ప్రాణాలు అర్పించారని తెలిపారు. తాను కలలు కన్నా స్వాతంత్రానికి విరుద్ధంగా ప్రస్తుత సమాజంలో పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారని, ధనికులు వందల వేల కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు. నాణ్యమైన విద్య వైద్యం దొరకక పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డబ్బులు ఉంటే తప్ప పేదలు చదువుకునే పరిస్థితి లేదని, విద్య వైద్యం అంగడిలో సరుకుగా మారిందని అరుణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ కలలుగన్న సంపూర్ణ స్వరాజ్యం ఇది కాదని, పేదవాడికి ఉచిత విద్య ,వైద్యం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు, ఇర్ఫాన్,చందు, మొయినాబాద్ మండల అధ్యక్షుడు రిశ్వంత్, చరణ్ గౌడ్, డివిజన్ నాయకులు విష్ణు కుమార్, నితీష్, నిఖిల్, అక్షయ్, నవీన్, లోకేష్, వివేకానంద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం...



**రాజేంద్రనగర్ మహా ;** పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విద్యాలయం, జాతీయ భవిష్య నిధి (ఎన్ ఎ ఎస్ ఎఫ్) కలిసి నిర్వహించిన ప్రతిష్టాత్మక పరిశోధన పథకంలో భాగంగా పశు ఉత్పత్తి, పోషణలో భాగమైన అందరి నైపుణ్యాన్ని వివిధ రకాల ఎక్స్టెన్షన్స్ మాడుల్స్ ను రూపొందించడానికి ఈ పరిశోధన ఉపయోగపడింది. కర్ణాటక పశు వైద్య విద్యాలయం, మహారాష్ట్ర పశు వైద్యవిద్యాలయంతో కలిసి రూపొందించారు. ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా సోమవారం ముగింపు కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ఇన్ లైవ్ స్టాక్ ను ఉపకులపతి ప్రొఫెసర్ ఎం జ్ఞాన ప్రకాష్ 17వ అకాడమిక్ కౌన్సిల్లో విడుదల చేశారు. ఇమాన్యుల్ లో పశు పోషణలో ఉన్నటువంటి పశు వైద్యాధికారుల, పశు విస్తరణ అధికారులు, అభ్యుదయ పాడి రైతులకు కావలసిన అనేకమైన నైపుణ్య అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూలంకషంగా వివరించారు. విలువ ఆధారిత పాల పదార్థాల తయారీ విధాన వీడియోని విడుదల చేశారు. వీడియోని వీక్షించిన వారు సులభంగా తమ వద్ద ఉన్న పాలను విలువ ఆధారిత పాల పదార్థాలుగా సులువుగా తయారు చెయ్యగలరు. శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం మీద రూపొందించిన మొబైల్ యాప్ ను యూనివర్సిటీ ఉపకులపతి విడుదల చేశారు. దీని ధర పందుల పెంపకం చేపట్టి రైతులు ఔత్సాహికులు ఈ విధంగా పందుల పెంపకం చేపట్టాలన్నారు. ఈ విధంగా రూపొందించినటువంరూపొందించినటువంటి ఈ ఎక్స్టెన్షన్ మాడ్యుల్స్ ను ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ శరత్ చంద్ర, డాక్టర్ ఎం ఉదయ్ కుమార్, పరిశోధన సంచాలకులు ప్రొఫెసర్ సిహెచ్ హరికృష్ణ, విస్తరణ సంచాలకులు ఎంకిషన్ కుమార్, ప్రొఫెసర్ జయలక్ష్మి, డాక్టర్ కే సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయబాటలో పయనిద్దాం

- ఎంసిపిఐ(యు) జిల్లాకార్యదర్శి, ఎఐ
- ఎఫ్డిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ పిలుపు



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని రామ టాకీస్ సెంటర్ లో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి ఎంసిపిఐ (యు) పార్టీజిల్లాకార్యదర్శి,ఎఐఎఫ్డిఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి సబ్బని రాజేంద్రప్ర సాద్,పార్టీ,ఎఐఎఫ్డిఎస్, ఎఐఎఫ్డివై జిల్లా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా 95వ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భరతమాత దాస్య శృంఖలాలను బద్దలు కొట్టడానికి,బ్రిటిష్ వాళ్ళను దేశం నుండి తరిమి కొట్టడానికి,నూనూగు మీసాల చిన్నవయసులోనే రాజ్గురు, సుఖ్ దేవ్ లతో కలిసి బ్రిటిష్ పార్లమెంటు పైన బాంబులవర్షం కురిపించి చిరునవ్వులు చిందిస్తూ ఉరికొయ్యలను ముద్దాడుతూ ఇంక్విలాబ్ నినాదాన్ని దేశ యువతకు ప్రజలకు అందించి యువతను విప్లవ బాటలో పయనించాలని, బానిసత్వాన్ని ఎదిరించాలని ,బ్రిటిష్ వాళ్ళను ఈ దేశం నుండి పారద్రోలే వరకు విశ్రమించొద్దని నినదించిన,ప్రబోధించిన వీర కిశోరం ,విప్లవ సింహం,యువతరానికి స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్ అని,ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయిన ఆయన మరణం ఈ దేశంలో విప్లవానికి శంఖారావాన్ని పూరించిందని, యువతరాన్ని మేల్కొలిపిందని, చైతన్యాన్ని రగిలించిందని,అన్ని వర్గాల ప్రజలను కదిలించిందని, ఎంతోమంది వీరులను,విప్లవకారులను ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములను చేసిందని,ఆనాటి అమరుల త్యాగ ఫలితమే ఈనాటి స్వాతంత్ర్యమని,కాని ఆ అమరుల కలలు ఈనాటి వరకు నెరవేరలేదని,అధికార మార్పు మాత్రమే జరిగిందని,తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారని, ప్రజల బ్రతుకుల్లో అణువంతైన మార్పు రాలేదని, పేదరికం ,దోపిడి పోలేదని,విద్య,వైద్యం,ఉద్యోగం,దున్నేవానికి భూమి,గిట్టుబాటు ధరలు,ఆడపిల్లల జీవితాలకు భద్రతఇంకెన్నో మరెన్నోసమస్యలు తీరే దారి కనుచూపు మేరలో కానరావడంలేదని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి,అవకాశవాద, ప్రజావ్యతిరేక పాలన వల్ల ఈ దేశంలోని బడుగు,బలహీన వర్గాలు రెక్కాడితేనే డొక్కాడే కష్టజీవులు, రైతులు,వ్యవసాయ కూలీలు,అన్ని వర్గాల ప్రజలు ప్రతిరోజు పడరాని పాట్లు పడుతున్నారని,బ్రతుకు బండి లాగలేకపోతున్నారని, అందుకే అమరజీవి భగత్ సింగ్ అందించిన స్ఫూర్తితో యువత నడుము కట్టాలని,పిడికిలెత్తాలని, ఈ దోపిడి పాలనకు చరమగీతం పాడాలని జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోఎంసిపిఐ(యు) పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎఐఎఫ్డివై రాష్ట్ర ఉపాధ్యక్షులు పసులేటి వెంకటేష్,ఎంసిపిఐ(యు) పార్టీ పట్టణకార్యదర్శి ఆరెపల్లి రమేష్,సతీష్,పోషన్న, షేక్ మహ్మద్,రాజేష్ పాల్గొన్నారు.

## అవుట్సోర్సింగ్ ఏజెన్సీలు ఈపీఎఫ్,ఈఎస్ఐ ఇవ్వాలి

**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్**
**సీఐటీయు నేత రంజిత్ కుమార్ ఫిర్యాదు**



**మంచిర్యాల, మహా :** అవుట్సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో వివిధ బీసీ సంక్షేమ హాస్టలల్లో ఔట్సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పని చేస్తున్న ఉద్యోగులకు 20222324 విద్యా సంవత్సరం ఏజెన్సీ నిర్వాహకులు వర్కర్లకు ప్రతినెలా చెల్లించే ఈపిఎఫ్, ఈఎస్ఐ డబ్బులను చెల్లించలేదని ఆరోపించారు. ఈ విషయంపై గత సంవత్సరం 27 సెప్టెంబర్ నాడు జిల్లా బీసీ వెల్ఫేర్,జిల్లా ఉపాధి కల్పన, లేబర్ అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి 5 నెలలు కావస్తున్న సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా అవుట్సోర్సింగ్ ఏంపనల్ చైర్మన్ జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## 26 నుంచి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

- మూడు రోజులపాటు శ్రీకోదండ శ్రీరామచంద్రస్వామి ఉత్సవాలు కొనసాగింపు
- 27న సీతారాముల పరిణయం.. రథోత్సవం
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పణ

**తొలిప్రభ, ఆమనగల్లు:** తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన,ప్రముఖ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతూ రాష్ట్ర స్థాయిలో ఖ్యాతిగాంచి నిత్య పూజలు, భక్తుల సందడితో భాసిల్లుతున్న కడ్తాల మండలం మైసిగండి రామాలయం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది.తెలంగాణలో భద్రాచలం తర్వాత ప్రభుత్వ లాంఛనా లతో మైసిగండి రామాలయంలో సీతారాముల పరిణయం నిర్వహిస్తారు. ప్రతీఏటా చైత్రశుద్ధ అష్టమి నుంచి శుద్ధ దశమి వరకు శ్రీ కోదండరామచంద్ర స్వామి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఇక్కడ అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం మైసిగండి రామాలయాన్ని సర్వాంగ సుందరంగా,శోభాయమానంగా అలంకరించారు. మూడు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, నాగర్ కర్నూల్, మహ బూబ్ నగర్, యాదాద్రి, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారు.మైసిగండి శివ, రామాలయం ముందుభాగంలో ఉన్న కోనేరు గంగ సమతుల్యతను సంతరించుకుంది. ఇక్కడ స్నానాలు ఆచరిస్తే పాపాలు, రోగాలు తొలగుతా యని భక్తుల విశ్వాసం. శిథిలావస్థకు చేరిన కోనేరును సుమారు కోటి రూపాయల వ్యయంతో పునరుద్ధరించారు. ఇక్కడి కోనేరు భక్తులను ఎంతగానో ఆకర్షిస్తోంది మైసిగండి రామాలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీ సీతారామచంద్ర స్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల కోసం నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు విశాల వసతులు ఏర్పాట్లు చేపట్టారు.వేసవి తీవ్రత నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ ముందుభాగంలో చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరిస్తున్నారు. దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ నుంచి మైసిగండికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.కాగా, భద్రాచలం మాదిరిగానే మైసిగండి రామాల యంలో ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. తెలంగాణ ప్రభుత్వం కల్యాణం రోజు ముత్యాలు, తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించడం అనవాయితీ. ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, దేవాదాయశాఖ అధికారులు హాజరుకానున్నారు.

**బ్రహ్మోత్సవాల వివరాలు**

మైసిగండి రామాలయంలో ఈనెల 26 నుంచి 28 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి, ఈవో స్నేహలతలు వివరించారు. 26న విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, అఖండజ్యోతి స్థాపన, ధ్వజారోహణం, హోమశాల ప్రవేశం, 27న శ్రీరామనవమి సందర్భంగా మధ్యాహ్నం 12.30 గంటలకు సీతారాముల పరిణయ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం, 28న చక్రతీర్థం, పుష్కర స్నానం, పుర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని సిరోలిపంతూ, స్నేహలతలు కోరారు.

## విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కాలేజ్ రోడ్డులోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10 వ తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష సమయాలలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గైర్హాజరు కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహించాలి

- వైద్య సమస్యలు ఉంటే సంక్షేమ అధికారులు పరిష్కరించాలి
- వివిధ గనుల అధికారులతో సమీక్ష సమావేశం



**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియాలో గైర్హాజరు కార్మికులకు ఆయా గనుల సంక్షేమ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించాలని డిజిఎమ్ (పర్సనల్) అశోక్ వెల్లడించారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ గనుల సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 నుండి 2025 వరకు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగుల పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవాలని కోరారు.విధులకు తరచుగా గైర్హాజరవుతున్న ఉద్యోగులపై తీసుకుంటున్న చర్యలలో ఎటువంటి జాప్యం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఉద్యోగులకు వెల్ఫేర్ ఆఫీసర్ల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించాలని అన్నారు.వారి వారి సమస్యలను విశ్లేషించి విధుల్లో చేరేలా ప్రోత్సహించాలని డిజిఎమ్ సూచించారు. వై.డి.ఏ.ఎం.ఎస్ డేటా క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోర్టల్లో ఎప్పటికప్పుడు కచ్చితంగా చేర్చాలని ఆయన వెల్లడించారు. డిజిటల్ రికార్డుల నిర్వహణలో ఏ మాత్రం అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. కార్మికులు దీర్ఘకాలిక గైర్హాజరు వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత దెబ్బతినకుండా, పెండింగ్లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించి తుది నివేదికలు సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంస్థ నియమ నిబంధనలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో డి వై పి ఎం ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సందీప్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వంశీ,ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, అన్ని గనుల సంక్షేమాధికారులు, సంబంధిత విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటమికి కుంగి పోవద్దు- కంది శ్రీనివాస రెడ్డి

**ఓటమి చెందిన సర్పంచ్ అభ్యర్థులతో సమావేశం**



**ఆదిలాబాద్ మహా :** ఓటమి రేపటి గెలుపుకు పునాది అని ఓడిపోయిన వారు కుంగిపోవద్దని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.సోమవారం తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో ఇటీవలి గ్రామ పంచాయితీల ఎన్నికల్లో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. చాలా భవిష్యత్తు ముస్ముందు ఉందని వారిలో ఉత్తేజాన్ని నింపారు.ఓటమి చెందినప్పటికీ నిరాశ చెందకుండా రేపటి భవిష్యత్తు కోసం నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు.


## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

**ప్రాణాపాయ స్థితిలో భార్య భర్తలు**



**మందమర్రి, మహా :** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి బొక్కల గుట్ట జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతున్న పోషిని వెంకటస్వామి, సుమలత భార్యాభర్తలను లారీ ఢీ కొట్టిన ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలై మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదానికి గురి అయిన దంపతులు మందమర్రి పట్టణానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలుస్తోంది. సదరు బాధితుడు వెంకటస్వామి సింగరేణి కాలరీస్ కంపెనీ కేకే 5 గనిలో ట్రామర్ గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మీరు ఇరువురికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి విషయాలు తెలియవలసి ఉంది. ప్రమాద ఘటనను తెలుసుకున్న మందమర్రి సర్కిల్ ఇన్స్ పెక్టర్ రమేష్ హుటాహుటిన సంఘటనస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు.





# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

## కంది శ్రీనివాస రెడ్డితో పాటు హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ అనూష

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణం లోని ప్రజా సేవా భవన్ లో సోమవారం అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి గారి నేతృత్వంలో ప్రజా దర్బార్ నిర్వహించారు.కార్యక్రమంలో ఆయతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష పాల్గొని ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల దరఖాస్తుల ను ఎంట్రీ చేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీని ద్వారా సమస్యల పరిష్కానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ఆటో అప్డేట్ అవుతుందన్నారు.అటు కంది శ్రీనన్న ఓడిపోయినప్పటికీ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతుండటం గొప్ప విషమన్నారు.ప్రతీవారం ఇలా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని ప్రశంసించారు.



# రైతుల భరోసా నిధుల విడుదలతో హర్షం

## సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు కంది శ్రీనివాస రెడ్డి పాలాభిషేకం

**ఆదిలాబాద్ మహా :** రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు విడుదల పట్ల రైతులందరు చాలా సంతోషంగా ఉన్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో పాటు పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులతో కలిసి సీయం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసారు. రైతు భరోసా నిధులు విడుదల తో ప్రజా పాలనలో ప్రభుత్వం రైతు ఉత్సవాలు జరుపుతుందన్నారు.రాష్ట్రంలోని 70 లక్షల మంది అన్నదాతల ఖాతాల్లో నిధులు జమయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆలయ షెడ్డును ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి తన స్వగ్రామం హస్నాపూర్ గ్రామాన్ని సందర్శించారు.గ్రామంలోని శ్రీరామాలయాన్ని సందర్శించిన ఆయనకు గ్రామస్తులు ఆలయ కమిటి వారు ఘన స్వాగతం పలికారు ఆలయ ఆవరణలో నిర్మించిన షెడ్డును కంది శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు.తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఎంతో సేవ చేస్తానని గ్రామ సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాలతో సత్కరించారు.




# ప్రతిపాదనలు సిద్ధం చేయండి

## మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా :** అదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల కోసం గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు ,ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి , సీయం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి లకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తో కలిసి వినతి పత్రమిచ్చినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు .తమ అభ్యర్థన మేరకు చనాక కోరాటా నుండి తాగునీటి కొరకు 54 కోట్లు , డ్రైనేజీలు , కల్వర్టులు, సిసి రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి 100 కోట్ల రూపాయలతో గవర్నమెంట్ కు ప్రతిపాదనలు పంపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..దీంతో మున్సిపల్ చైర్ పర్సన్ అధికారులతో సమావేశం ఏర్పాటు అధికారులు, సిబ్బంది వార్డ్ ల వారీగా పర్యటిస్తూ 49 వార్డుల నుండి ప్రపోజల్స్ వెంటనే తయారు చేయాలని ఆదేశించారు. అదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అత్యంత వెనుకబడ్డ వార్డులకు మొదటి ప్రయారిటీ ఇస్తామని తెలిపారు.ఈ వంద కోట్లు నాలుగు విడతలుగా ఇస్తామని మంత్రి చెప్పినట్టు తెలిపారు.

# కాంగ్రెస్ లో సర్పంచుల చేరిక

## కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ముగ్గురు సర్పంచులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.బూర్నూర్,లోహార,లింగుగూడ గ్రామ పంచాయితీల సర్పంచులు ఆత్రం గంగారాం, వసంత్ రావు , మానిక్ రావులకు కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. గ్రామ పంచాయితీల ప్రగతి కోసం సర్పంచులు అధికార కాంగ్రెస్ లో చేరడం చాలా సంతోషకరమన్నారు.అంతా కలిసి పల్లెల ను అభివృద్ధి చేసుకుందామని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు

# కంది శ్రీనన్నది గొప్ప మనసు - మున్సిపల్ చైర్ పర్సన్



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని కంది శ్రీనివాస రెడ్డితో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సందర్శించారు. కేంద్రానికి వచ్చినవారికి వారు స్వయంగా వడ్డించి ఆప్యాయంగా పలకరించారు. పేదల కడుపు నింపాలన్న పెద్ద మనస్సుతో మూడున్నరేళ్ల కిందట చేపట్టిన నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విరామంగా సాగుతోందని అనూష అన్నారు.. అమెరికా నుండి ఆదిలాబాద్ కు వచ్చిన తర్వాత కేఎస్ఆర్ ఫౌండేషన్ శ్రీనన్న అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. ప్రతిరోజూ ఎంతోమంది ఆకలి తీర్చుతూ నిత్యాన్నదాత గా జిల్లాలో పేరు తెచ్చుకున్నారన్నారు.అటు పేదల కడుపునింపే అవకాశం తనకు భగవంతుడిచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. తాను బతికున్నంత కాలం అన్నదానం నిత్యం కొనసాగుతుందని తెలిపారు.



# కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి శ్రీకృష్ణ హాస్పిటల్ ను సందర్శించారు ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకులు అల్చెట్టి నాగన్న ను పరామర్శించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### పీజీ వైద్య సీట్ల కౌన్సెలింగ్

# గడువు పెంపుపై సుప్రీం విచారణ..

- స్పష్టతనివ్వాలని ఎన్ఎంసీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం!
- తెలుగు రాష్ట్రాల్లో సీట్ల భర్తీపై కొనసాగుతున్న ఉత్కంఠ

**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య కోర్సుల సీట్ల భర్తీకి సంబంధించి నెలకొన్న ఉత్కంఠపై సుప్రీంకోర్టులో సోమవారం కీలక విచారణ జరిగింది. పీజీ సీట్ల భర్తీకి ఉద్దేశించిన కౌన్సెలింగ్ గడువును పొడిగించాలన్న అభ్యర్థనలపై సర్వోన్నత న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ వ్యవహారంపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన వైఖరిని స్పష్టం చేయాలని కోర్టు ఆదేశించింది. పీజీ మెడికల్ కౌన్సెలింగ్ ప్రక్రియలో గడువు ముగిసినప్పటికీ పలు సీట్లు మిగిలిపోవడం, వివిధ సాంకేతిక కారణాల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని కౌన్సెలింగ్ తేదీలను మరింత పొడిగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం క్షుణ్ణంగా పరిశీలించింది.దేశవ్యాప్తంగా వైద్య విద్యా ప్రమాణాలు, సీట్ల భర్తీ, కౌన్సెలింగ్ ప్రక్రియలను పర్యవేక్షించే అత్యున్నత నియంత్రణ సంస్థ అయిన ఎన్ఎంసీ.. ఈ కౌన్సెలింగ్ పొడిగింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో సవివరంగా వివరణ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. ఎన్ఎంసీ ఇచ్చే అధికారిక నివేదిక మరియు స్పష్టత ఆధారంగానే కౌన్సెలింగ్ గడువు పెంపుపై సుప్రీంకోర్టు తన తుది నిర్ణయం తీసుకోనుంది. సుప్రీంకోర్టు తాజా విచారణతో తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది పీజీ వైద్య విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. కౌన్సెలింగ్ గడువు ముగియడంతో మంచి ర్యాంకులు సాధించి కూడా ప్రవేశాలు పొందలేకపోయిన విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎన్ఎంసీ గనుక సానుకూలంగా స్పందిస్తే, మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు మరో అదనపు అవకాశం దక్కనుందని వైద్య అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తదుపరి విచారణలో ఎన్ఎంసీ ధర్మాసనానికి సమర్పించే నివేదిక ఈ వ్యవహారంలో అత్యంత కీలకంగా మారనుంది.



# వర్షపు నీరు నిల్వ ఉండకుండా యుద్ధ ప్రతిపాదిక చర్యలు

## బొంతు శ్రీదేవి యాదవ్

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ పోచమ్మ ఆలయం నుండి పైబస్తి వరకు 300 మీటర్లు 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభం కావడంతో సోమవారం రాత్రి చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ బజరంగ్ కాలనీ ఆయా కాలనీల ను మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సందర్శించి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా *బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, బాక్స్ డ్రైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వర్షపు నీరు నిల్వ ఉండకుండా లోతట్టు ప్రాంతాలలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా అధికారులకు సూచనలు ఇచ్చారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ ప్రాధాన్యమని పేర్కొన్నారు. గత సంవత్సరం స్థానిక నాయకులు కుషాయిగూడ బస్తీ వాసుల కోరిక మేరకు ఈ స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ పనులు శాంక్షన్ తీసుకోవడం జరిగింది కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగిన పనిని మొన్న జెడ్సి కమిషనర్ గారికి లెటర్ ఇవ్వడంతో ఈ రోజు పనులు ప్రారంభించడం జరిగిందని బొంతు శ్రీదేవి యాదవ్ తెలియచేశారు స్థానిక నాయకులు కుషాయిగూడ గ్రామ ప్రజలు బొంతు శ్రీదేవి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకటరెడ్డి సీనియర్ నాయకులు కాసుల పోచయ్య గౌడ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరజారెడ్డి అరుణ రమాదేవి కరీం గోపాల్ యాదవ్ కురెల్ళి రాఘవేందర్ గౌడ్ మహిళా కాంగ్రెస్ నేతలు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# ఆదివాసి గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

**మంచిర్యాల, మహా :** ఆదివాసి గిరిజనుల సంక్షేమం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. సోమవారం జన్నారం మండలం ఆదివాసీ గిరిజనులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్య, వైద్య సేవలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కార్యక్రమాలను అధికారులతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ కల్పిస్తున్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడ ముఖ్యమేనని చెప్పారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించాలని తెలిపారు. విద్యార్థులను సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ రోగాల బారిన పడి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో



మర్యాదగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి ఆరోగ్య స్థితిగతులు, ఇతర వివరాలను వైద్యులను అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

**కల్వాల్ వెదురు ఉత్పత్తి కేంద్రాల పరిశీలన**

కవ్వాల్ వెదురు ఉత్పత్తులు, శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ కేంద్రంలో తయారు చేసిన రకరకాల వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. అడవిలో లభించే వనరులను వినియోగించుకుని వెదురు ఉత్పత్తుల ఉత్పాదకతను పెంపొందించి అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. జన్నారం మండలంలోని ఆదివాసి గిరిజనులు అడవిలో దొరికే వెదురు, తునికాకు, ఇప్పపువ్వు తదితర వాటిపై ఆధారపడి జీవిస్తున్నారని, జీవనోపాధిని కల్పిస్తూ వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### సామాజిక సేవలలో భాగంగా ఎన్ఎస్ఎస్

# వేసవి ప్రత్యేక శిబిరం ప్రారంభం

- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహణ
- లంబడితండా గ్రామంలో కార్యక్రమం ప్రారంభించిన ప్రధానాచార్యులు సర్పంచులు,ఉప సర్పంచ్, ప్రజాప్రతినిధులు




**బెల్లంపల్లి , మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్)లో భాగంగా సోమవారం సామాజిక సేవలో భాగంగా ఏడు రోజుల వేసవి ప్రత్యేక శిబిరాన్ని బెల్లంపల్లి మండలంలోని లంబడితండా గ్రామంలో ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు.ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఎంఏ రేష్మ, గజెల్లి మోహన్ లఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. లంబడితండా సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్,గురిజాల సర్పంచ్ రంగ రామన్న, ఉప సర్పంచ్ రంగ ప్రశాంత్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం ప్రదీప్ కుమార్, మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**ఏడు రోజులపాటు కార్యక్రమం..**

గ్రామంలో పిచ్చి మొక్కలు మరియు చెత్త తొలగింపు, కాలువల పరిశుభ్రత, వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.లంబడితండా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు.గురిజాల సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. తమ గ్రామానికి వచ్చినందుకు ఉప సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కోరారు. గ్రామ సమస్యలు, అభివృద్ధి గురించి డేటా తయారు చేయండని మాజీ చైర్మన్ సూచించారు.గ్రామంలో ఏడు రోజులపాటు మంచి సేవా కార్యక్రమాలు చేపడతామని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రేష్మ వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం ఏ రేష్మ, సహాయ ఆచార్యులు డాక్టర్ ఏకాంబరం, తెలుగు అధ్యాపకులు డాక్టర్ కంబాల మురళీకృష్ణ, లంబడితండా సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్, గురిజాల సర్పంచ్ వంగ రామన్న, లంబడితండా ఉప సర్పంచ్ రంగ ప్రశాంత్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం ప్రదీప్ కుమార్, మాజీ చైర్మన్ కారుకూరి రామచందర్, పాఠశాలప్రధానోపాధ్యాయులు జావిద్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెల్ల దొరలకు వ్యతిరేకంగా విరోచితంగా పోరాడిన విప్లవకారులు

## భగత్ సింగ్ రాజ్ గురు సుక్ దేవ్

## అరుణోదయ విమలక్క

**కుషాయిగూడ, మహా :** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నాడు సామ్రాజ్యవాదం పెరుగుతున్న తరుణంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అతి చిన్న వయసులో ప్రాణాలు అర్పించిన గొప్ప విప్లవ వీరులని అరుణోదయ సంస్కృతిక సమైక్య ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు అరుణో విమలక్కకొనియాడారు జవహర్ నగర్ లో ప్రజా కళాకారులు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు అరుణోదయ విమలక్క ప్రధాన వ్యక్త గా హాజరై ప్రజల ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ భారత దేశంలో విదేశీ పెత్తనం పెరిగిపోయిందని తెర చాటున కార్పొరేట్ శక్తులు పరిపాలిస్తున్నారని ప్రజల కోసం పోరాడే విప్లవకారులను ఎన్కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారని ఆమె విమర్శించారు ప్రస్తుతం అమెరికా ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధానికి కారణం అమెరికన్ సామ్రాజ్యవాదం అని నాడు స్వాతంత్ర ఉద్యమం నుండి సామ్రాజ్యవాదం మరింత పెరుగుతూ వచ్చిందని దానికి వ్యతిరేకంగా పోరాడి అనేకమంది అమరవీరులు బలి అయ్యారని వారి ఆశయ సాధన కోసం కార్మిక కర్షకుల పోరాటాలు ఉధృతం చేయాలని విమలక్క పిలుపునిచ్చారు జననాట్యమండలి మాజీ సభ్యులు మావోయిస్టు పార్టీ మాజీ సభ్యులు సంజీవ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఎత్తివేసేంతవరకు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు విరోచితంగా పోరాడాలని జవహర్ నగరప్రజలకు సూచించారు సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్రంలో బిజెపి మహనీయుల జీవిత చరిత్రలను వక్రీకరించి లౌకిక దేశంగా ఉన్న భారతదేశాన్ని కులం పేరుతో మతం పేరుతో విడదీసి కార్మికుల మధ్య చీలికలు తీసుకురావాలని



కుట్ర. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పరిశ్రమలకు బడ్జెట్ను ప్రవేశపెట్టిన ఆవిడ దూరంలో ఉందన్నారు తెలంగాణ ఉద్యమకారులు సంయుక్త యాక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మల ప్రపోల్ రామ్ రెడ్డి మాట్లాడుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ జవహర్ ప్రజలకే కాకుండా చుట్టుపక్కల కాలనీల ప్రజలకు మరో నలగొండ ఫ్లోరైడ్గా మారిందని అన్నారు డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని అరుణోదయ నిర్మల అన్నారు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను ఎత్తివేస్తామని పాలకులు హామీలు నీటి మూటలుగానే మారినాయని ప్రజాకవి బైరాగి అన్నారు తెలంగాణ సాంస్కృతిక సలహాదారులు దరువు అంజన్న మాట్లాడుతూ జవహర్ నగర్ లో మత్తుకు బానిసై యువత జీవితాలు ఛిద్రమవుతున్నాయని యువతి యువకులలో అవగాహన సదస్సుల ద్వారా మార్పులు తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు కార్యక్రమంలో ప్రజా గాయకుడు వెంకటాచారి జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కార్ కారింగులశంకర్ గౌడ్ మాజీ కార్పొరేటర్ నిహారిక గౌడ్ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్ సిపిఐ జిల్లా నాయకులు సిహెచ్ దశరథ్ షేక్ మీరా సిపిఐ ఎంఎల్ చంద్రపుల్లారెడ్డి పార్టీ నాయకులు షేక్షావలి ఎ ఐ ఎఫ్ టి యు నాయకులు ఎర్రెల్లి మల్లేశం ప్రజా సంఘాల నేతలు అరుణోదయ కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు సభికులను ఎంతో ఆకట్టుకున్నాయి

# సాయి సుధీర్ కళాశాలలో ట్రై ఇంపాక్ట్–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- విద్యార్థుల్లో పరిశోధనాసక్తి పెంపే లక్ష్యం
- ప్రముఖుల సమక్షంలో అవగాహన ఒప్పందం




**కుషాయిగూడ, మహా :** ఈసీఐఎల్ లోని సాయిసుధీర్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో 'ట్రైఇంపాక్ట్-సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' క్లబ్ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. విద్యార్థుల్లో పరిశోధనాభిలాషను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు వినూత్నంగా ఉన్నాయని ప్రశంసించారు. సాంప్రదాయ విద్యతో పాటు పరిశోధన, ఆవిష్కరణలపై దృష్టి సారిస్తేనే భవిష్యత్తులో విజయాలు సాధ్యమని సూచించారు. ఎక్కువ మంది విద్యార్థులు రిసెర్చ్ రంగంలోకి వచ్చి తమ ప్రతిభను నిరూపించాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. బాలభాస్కర్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో పరిశోధనకు ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. ట్రైఇంపాక్ట్ కేంద్రం విద్యార్థులకు నూతన అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి కొనకల్ల సూర్యప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ పరిశోధన, స్టార్టప్, ఇన్నోవేషన్ రంగాల్లో విద్యార్థులు ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కళాశాల మేనేజ్మెంట్, రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశోధన, శిక్షణ, పారిశ్రామిక అనుభవం వంటి రంగాల్లో సహకారం అందించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ట్రైఇంపాక్ట్ క్లబ్కు చెందిన విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించి అతిథులను ఆకట్టుకున్నారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్, సామాజిక సమస్యల పరిష్కారాలకు సంబంధించిన పలు ప్రాజెక్టులు ప్రత్యేకంగా నిలిచాయి. ప్రిన్సిపాల్ డా. మీరారాణి ఆధ్వర్యంలో, ప్రొఫెసర్ ఎల్. పద్మ పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# సామర్లకోటలో భారీ చోరీ..

## కిలో బంగారం స్వాహా!

**సామర్లకోట, మహా:** జీవితకాలం కష్టపడి కూడబెట్టుకున్న ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి సొమ్మును దొంగలు రాత్రికి రాత్రే ఊడ్చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణంలో జరిగిన ఈ భారీ చోరీ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం..సామర్లకోటలో నివాసం ఉంటున్న సదరు రిటైర్డ్ టీచర్, తన కుటుంబ సభ్యులతో కలిసి పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటి పరిసరాలను నిశితంగా గమనించి, పక్కా ప్రణాళికతో లోపలికి చొరబడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన కిలాడీలు, నేరుగా బీరువాల వద్దకు చేరుకుని వస్తువులన్నింటినీ చిందరవందర చేశారు.కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండటంతో వారు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. వెంటనే లోపలికి వెళ్లి బీరువాలను పరిశీలించగా..అందులో భద్రపరిచిన సుమారు కిలో బంగారు ఆభరణాలు, ఐదు కిలోల వెండి వస్తువులు కనిపించకుండా పోయాయి. వాటిని గుర్తుతెలియని దుండగులు అపహరించినట్లు గుర్తించిన బాధితులు లబోదిబోమంటూ కన్నీరుమున్నీరయ్యారు.



# బుట్ట బొమ్మలా.. బేబమ్మ అదిరిపోయిందిగా...

అందాల చిన్నది కృతి శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ బ్యూటీ ఎంతో మంది అభిమానుల మనసు దోచుకుంది.

**ఉప్పెన మూవీ**

ఉప్పెన సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ అయ్యింది. తన అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకుంది. అంతే కాకుండా ఎంట్రీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. దీంతో వరసగా అవకాశాలు క్యూ కట్టాయి.

**ఒక్క మూవీతో సెన్సేషన్**

దీంతో ఈ బ్యూటీ టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్తుందని అందరూ అనుకున్నారు. అంతే కాకుండా వరసగా అవకాశాలు అందుకొని, చాలా సినిమాల్లో నటించింది.

**వరుస అవకాశాలు**

అయితే ఈ బ్యూటీ నటించిన చాలా సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. దీంతో ఈ అమ్మడు అంతగా గుర్తింపు సంపాదించుకోలేకపోయింది.

**డిజాస్టర్**

చేసిన సినిమాలు అన్నీ డిజాస్టర్ అవ్వడంతో ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు కూడా తగ్గిపోయాయి. దీంతో కోలీవుడ్ వైపు కన్నేసింది. అక్కడ పలు సినిమాల్లో నటిస్తుంది.

**తగ్గిన అవకాశాలు**

అంతే కాకుండా తెలుగులో కూడా పలు సినిమాల్లో నటిస్తూ తన అందచందాలతో అందరి మనసు దోచేస్తుంది. ఇక ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది.

**అంద చందాలు**

తాజాగా ఈ ముద్దుగుమ్మ గ్రీన్ కలర్ డ్రెస్‌లో అందంగా రెడీ అయ్యింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టిం తెగ వైరల్ అవుతున్నాయి.



# ఆచితూచి అడుగులేస్తున్న కుర్ర భామ రితిక నాయక్ ..

రితికా నాయక్.. ఈ అందాల ముద్దుగుమ్మ చేసింది తక్కువ సినిమాలే అయినా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. విశ్వక్ సేన్ నటించిన అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనస్సులో స్థానం సంపాదించుకుంది ఈ చిన్నది. తొలి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. ఆతర్వాత వరుసగా తెలుగులో అవకాశాలు అందుకుంది. ఇటీవలే ఈ ఆముద్దుగుమ్మ మిరాయ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. యంగ్ హీరో తేజ సజ్జ హీరోగా నటించిన మిరాయ్ మంచి విజయాన్ని అందుకుంది.ఇక ఇప్పుడు ఈ అమ్మడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ప్రస్తుతం యంగ్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందికుంటుంది. వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న కొరియన్ కనకరాజు అనే సినిమాలో నటిస్తుంది రితిక నాయక్. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ సుందరి తన క్యూట్ ఫోటోలను పంచుకుంటూ అభిమానులను కవ్విస్తుంది..



# ఆలియా భట్‌పై నెటిజన్ల ఫైర్!

## ఒకవైపు 'వన్యప్రాణుల సంరక్షణ'.. మరోవైపు 'లెదర్ బ్రాండ్' ప్రచారం?

నేటి కాలంలో సెలబ్రిటీలు కేవలం వెండితెరపై మెరిస్తే సరిపోదు, వారు చేసే ప్రచారాలు, వారు పాటించే విలువల మధ్య సమన్వయం ఉండాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. ఆలియా భట్ విషయంలో తలెత్తిన ఈ వివాదం 'సెలబ్రిటీ అడ్వకేసీ' మరియు 'బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్' మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఎత్తి చూపుతోంది. గ్లోబల్ ఐకాన్, బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన చర్చకు కేంద్రబిందువుగా మారారు. ప్రపంచ ప్రఖ్యాత 'నేషనల్ జియోగ్రాఫిక్' సంస్థ తన 2026 ఎడిషన్ "33" జాబితాలో ఆలియాను ఒక 'చేంజ్ మేకర్' గా గుర్తించింది. వన్యప్రాణుల సంరక్షణ మరియు పర్యావరణం పట్ల ఆమె చూపిస్తున్న చొరవను అభినందిస్తూ ఈ గౌరవం దక్కింది. అయితే, ఇదే సమయంలో ఆమె లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'గుచ్చి'కి గ్లోబల్ అంబాసిడర్‌గా ఉండటం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలకు దారితీసింది. పర్యావరణ హితం కోరే వ్యక్తి, జంతు చర్మంతో వస్తువులను తయారు చేసే బ్రాండ్‌ను ఎలా ప్రోత్సహిస్తారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

**ఆలియా చొరవ..**

చిన్నతనం నుండే జంతువులంటే ప్రాణమిచ్చే ఆలియా, గత కొన్నేళ్లుగా వన్యప్రాణుల సంరక్షణ కోసం గొంతు విప్పుతున్నారు. జంతు సంరక్షణ కేంద్రాలకు మద్దతు ఇవ్వడం, పిల్లల కోసం 'సస్టైనబుల్' (పర్యావరణ హిత) దుస్తుల బ్రాండ్‌ను ప్రారంభించడం వంటి పనులు ఆమెకు ఈ గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ఒక నటిగా తనకున్న ప్రభావాన్ని సామాజిక మార్పు కోసం వాడుతున్నారని పేర్కొంది.

**విమర్శలకు దారితీసిన 'లెదర్' దుస్తులు..**

అయితే, ఈ వార్త బయటకు వచ్చిన వెంటనే ఇంటర్నెట్‌లో విమర్శల వర్షం కురిసింది. ఇటీవల మిలాన్ ఫ్యాషన్ వీక్‌లో ఆలియా 'గుచ్చి' బ్రాండ్ కోసం ధరించిన పూర్తి లెదర్ దుస్తుల ఫోటోలను నెటిజన్లు షేర్ చేస్తున్నారు. "నోటితో జంతువులను కాపాడాలని చెబుతూ.. ఒంటిపై జంతు చర్మంతో చేసిన దుస్తులు ధరించడం ఏంటి?" అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. "ఇది నేషనల్ జియోగ్రాఫిక్ జాబితానా లేక వోగ్ (Vogue) మ్యాగజైన్ కవరా?" అని నెటిజన్లు నిలదీస్తున్నారు. ఈ వివాదం ఒక లోతైన ప్రశ్నను తెరపైకి తెచ్చింది. ఒక వ్యక్తి లగ్జరీ ఫ్యాషన్ ఐకాన్‌గా ఉంటూనే, జంతు సంరక్షకురాలిగా కొనసాగగలదా? ప్రస్తుత ఫ్యాషన్ ప్రపంచం పర్యావరణ హితం వైపు మారుతున్నప్పటికీ, లెదర్ అనేది ఇప్పటికీ లగ్జరీ బ్రాండ్లకు ప్రధాన వనరు. ఆలియా వంటి స్టార్స్ ఈ రెండు భిన్నమైన విలువల మధ్య చిక్కుకుపోయారు. కేవలం ప్రకటనల కోసమే కాకుండా, వ్యక్తిగత జీవితంలోనూ ఆ విలువలను పాటిస్తేనే గుర్తింపు దక్కుతుందని నెటిజన్ల వాదన. 2026లో ప్రేక్షకులు సెలబ్రిటీల నుండి కేవలం గ్లామర్ మాత్రమే కాదు, 'నిలకడైన నిజాయితీ'ని కోరుకుంటున్నారు. ఆలియా భట్ తన ప్లాట్‌ఫారమ్‌ను మంచి పనుల కోసం వాడుతున్న మాట వాస్తవమే అయినా, ఆమె ధరించే దుస్తులు మరియు చేసే ప్రచారాల విషయంలో మరింత స్పష్టత ఉండాలని ఈ వివాదం స్పష్టం చేస్తోంది.



# స్టార్ హీరో ఇంటికి కోడలిగా రోజా కూతురు..?

ఆర్కే రోజా.. తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్ర వేసి, ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి సక్సెస్ అయ్యారు రోజా. సినిమాలు, రాజకీయాలతోనే కాదు బుల్లితెరపై కూడా సందడి చేసి ప్రేక్షకులను అలరించారు రోజా. ఇటీవలే సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు రోజా.. తమిళ్ లో ఓ సినిమాలో నటిస్తున్నారునటి రోజా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.. నటిగా, రాజకీయ నాయకురాలిగా రాణిస్తున్నారు. కాగా రోజా సెల్వమణి కూతురు అన్షు మాలిక గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. చిన్న వయసులోనే అత్యున్నత స్థాయికి ఎదిగింది. ప్రపంచస్థాయిలో ఎన్నో అవార్డులను అందుకుంది. ఇప్పటికే పలు పుస్తకాలు రచించి రచయితగా గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాకుండా ఎంట్రప్రెన్యుయర్, ప్రోగ్రామర్‌గానూ రాణిస్తోంది. కాగా అన్షు మాలిక పెళ్లి గురించి గతకొన్ని రోజులుగా రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కాగా ఓ ఇంటర్వ్యూలో రోజా దీని పై క్లారిటీ ఇచ్చారు. ఓ స్టార్ హీరో ఇంటికి రోజా కూతురు కోడలిగా వెళ్తుందని టాక్ చక్కర్లు కొడుతుంది.గతంలో రోజా ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ.. 1991లో తన మొదటి సినిమా షూటింగ్ సమయంలోనే తన భర్త సెల్వమణికి తనపై ప్రేమ కలిగిందని రోజా అన్నారు. తాను ఆ సమయంలో చాలా చిన్నదానిని కావడం, భాష (తమిళం) తెలియకపోవడం వల్ల ప్రేమ గురించి పెద్దగా ఆలోచించలేదని చెప్పారు. సెల్వమణి తన కుటుంబ బంధాలను చూసి ఆకట్టుకుని, నేరుగా తన తల్లిదండ్రులను అడిగి తన ప్రేమను వ్యక్తపరిచారని తెలిపారు రోజా. 1991లోనే నిశ్చితార్థం జరిగినప్పటికీ, వివాహం ఆలస్యమైందని చెప్పారు. అదేవిధంగా తమ కుటుంబంలో సెల్వమణి గారే నిశ్శబ్దంగా ఉండే కఠినమైన వ్యక్తి అని, పిల్లలు కూడా ఆయనకే భయపడతారని నవ్వుతూ చెప్పారు. తన కుమారుడు కౌశిక్ గురించి మాట్లాడుతూ.. ఏడవ నెలలో కౌశిక్ ప్రీమెచ్యూర్ బేబీగా జన్మించాడని తెలిపారు రోజా. అందుకే తనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాననితెలిపారు. కౌశిక్ సినిమాల పట్ల ఆసక్తి చూపుతున్నాడని, దర్శకత్వం లేదా నటనలో ఏదైనా ఎంచుకోవచ్చని రోజా అన్నారు. అలాగే తన కూతురు అనుషమాలిక గురించి బయట ప్రచారంలో ఉన్న స్టార్ హీరో ఇంటికి కోడలిగా వెళ్ళే అవకాశం అనే వార్తలను ఆమె నవ్వుతూ ఖండించారు. తన చెవికి అలాంటి ప్రపోజల్స్ ఏమీ రాలేదని స్పష్టం చేశారు. అనుషమాలికకు చదువు పట్ల ఎంతో ఆసక్తి ఉందని, అమెరికాలో చదువుకుంటుందని, శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో ఉందని రోజా తెలిపారు. ఆమె చిన్నతనం నుంచే సామాజిక సేవ, సహాయ గుణం కలిగి ఉందని, అనేక మంది పిల్లల చదువుకు సహాయం చేస్తుందని, అనేక అవార్డులు గెలుచుకుందని చెప్పారు. తమ పిల్లల విషయంలో, తల్లిదండ్రులుగా తాము డాక్టర్లు, ఇంజనీర్లు కాలేదని వారిని బలవంతం చేయమని, వారికి ఏది నచ్చితే అది సరైనదా కాదా చూసి ఆ మార్గంలో ప్రోత్సహిస్తామని రోజా చెప్పుకొచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com